4922



15, 16

కార్ల్‌మార్క్స్ శతవర్ధంతి ప్రత్యేక సంచిక





15

# అగ్నిగుండం

ఈ రోజు అస్సామ్ ఒక అగ్నిగుండంలా ఉంది. విదేశీయుల పేరిట మహిళలు, వృద్ధులు, పసిపిల్లలు అనే తారతమ్యం లేకుండా అమాయక ప్రజలపై అక్కడ జరుగుతున్న దారుణ హింసాకాండ ఒక నరమేధ యాగాన్ని గుర్తుకు తెస్తోంది. గత కొద్ది మాసాలుగా అనునిత్యం బెంగాలీలు, అస్సామేతరులు అస్సాం నుంచి తప్పించుకొని పొరుగు రాష్ట్రాలలో తలదాచుకొనేందుకు సకుటుంబాలతో తరలివస్తున్నారు. ఒకప్పుడు కన్పించిన సహిష్ణుత ఈనాడు అస్సామ్ ఉద్యమంలో లేదు. రాను రాను అక్కడ ఉద్యమం హింసాయుత రూపం ధరిస్తోంది. అస్సామేతరుడు ఎవరైనా సరే, బెంగాలీ, బెంగాలీ ముస్లిమ్ లేదా అస్సామ్ పర్వత ప్రాంతాల్లో దశాబ్దాలుగా జీవిస్తున్న అటవీ జాతులవారు ఎవరైనా కానివ్వండి అందరి ఇళ్ళను దయాదాక్షిణ్యాలు లేకుండా అస్సామ్ ఉద్యమకారులు తగలబెడుతున్నారు. ఈ మధ్య "నెల్లీ'' అనే ప్రదేశంలో జరిగిన మారణహోమం దేశవ్యాప్తంగా ప్రకంపనాలు సృష్టించింది. పాపం పుణ్యం ఎరుగని పసిపిల్లలనే కనీస మానవతా కారుణ్య దృష్టి లేకుండా వేల సంఖ్యలో శిశువుల్ని సంఘవ్యతిరేకశక్తులు దారుణంగా హత్యచేసాయి.

అస్సామ్‌లో సంక్షోభం ఇంతటి తారస్థాయి చేరుకోవడానికి చాలా కారణాలు కన్పిస్తాయి. వీటిలో ప్రధానమైనవి ఆర్థికమూ, సామాజికమైనవి బంగ్లాదేశ్ విముక్తి పోరాటం తర్వాత ఇందిరా-ముజీబ్ అంతర్జాతీయ ఒడంబడిక క్రింద కొన్ని వేలమంది శరణార్థులకు భారత ప్రభుత్వం ఈశాన్య భారతదేశంలో పునరవాస సౌకర్యం కలిగించింది. వీరిలో అధిక శాతం అస్సామ్‌లో స్థిరపడ్డారు. కాని దురదృష్టవశాత్తూ ఆనాటి నుంచి

నేటివరకూ మన సరిహద్దుల్ని దాటి అవిచ్ఛిన్నంగా ప్రవేశిస్తున్న విదేశస్తులను నిరోధించడానికి మన కేంద్ర ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ తీసుకోలేదు. ఈ అలక్ష్యమే ఈనాడు అస్సామ్ సంక్షోభాన్ని సృష్టించింది. తామున్న రాష్ట్రంలో తాము మైనారిటీలు కావడం ఏ రాష్ట్ర ప్రజలూ సహించరు. కానీ ఈ మనోభావన చారిత్రకంగా, సాంప్రదాయకంగా ఇతర భాషా ప్రజలపట్ల, జాతులపట్ల ఎంతో ఆదరణ, స్నేహశీలత ప్రదర్శించే అస్సామ్ భారతీయుల్లో అంత త్వరగా రాలేదు. దీనికి మరికొన్ని కారణాలు తోడయ్యాయి.

స్వాతంత్ర్యానంతరం మన కేంద్ర ప్రభుత్వ వైఖరి చాలా రాష్ట్రాల పట్ల సమంజసంగా కన్పించదు. ప్రత్యేకించి ఉత్తర-ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి అంతంత మాత్రంగానే కొనసాగింది. దేశం నుంచి ఈ ప్రాంతాలకు ఇప్పటికి సరియైన రవాణా సౌకర్యాలు లేవు. ఉత్తర-ఈశాన్య ప్రాంతాల్లో ప్రజల భాష, సంస్కృతి వీటి అభివృద్ధి పట్ల కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. నాగాలాండ్‌లో ఈనాడు అధికారభాష ఇంగ్లీషు. దీన్నిబట్టి పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు. దేశ జాతీయ ప్రవాహానికి దూరంగా ఒక అలీనతను గత కొద్ది దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని రాష్ట్రాలు మౌనంగా అనుభవిస్తూ వచ్చాయి. దూరదృష్టి లేని రాజకీయ విధానాల వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా కూడా అభివృద్ధి కాలేదు.

మిగిలిన రాష్ట్రాల కంటే వెనుకబాటుతనం, దీనికి తోడు ప్రజల్లో పేదరికం, తీవ్రమైన నిరుద్యోగ సమస్య, అస్సామ్ ప్రజలు తమ సంపదనంతటినీ సరిహద్దు అవలి ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దోచేసుకుంటున్నారేమోనన్న అనుమానాన్ని కల్గించాయి. వెనకబడిన ఈ ప్రాంతపు ప్రజల కంటె ఇతర భాషలు మాట్లాడే ప్రజలు సాంఘికంగా మరికాస్త హెచ్చు విజ్ఞానవంతులు కావటం మూలాన అస్సామ్‌లో చాలా వృత్తుల్లో, ప్రజాసంబంధమైన సేవల్లో అస్సామేతర్లు గడచిన రెండు దశాబ్దాల్లో అధికంగా ఉపాధి పొందారు. కానీ గణాంక శాఖ వివరాలు పరిశీలిస్తే ఈ ఆధిక్యత క్రమంగా క్షీణిస్తున్నట్టు స్పష్టమైన దాఖలాలు కన్పిస్తాయి. అలాగే ఈనాడు అస్సామ్‌లో అనధికారంగా ప్రవేశించిన విదేశీయులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ అస్సామీయుల సంఖ్యే అధికం అని కొత్తగా సేకరించిన మొన్నటి జనాభా లెక్కలు సూచిస్తున్నాయి.

మరి, ఈ ఉద్యమం ఎందుకు అన్న ప్రశ్న వస్తే దీనికి ప్రధాన కారణంగా సరిహద్దుల్ని కట్టుదిట్టం చేయకుండా ఉపేక్ష వహించిన కేంద్ర ప్రభుత్వాన్నే నిందించాలి. స్వాతంత్ర్యానంతరం నుంచి అనుసరిస్తూ వచ్చిన కొన్ని తప్పుడు విధానాల వల్ల ఉత్పన్నమైన ఈ పరిస్థితిలో కొన్ని విదేశీ శక్తులు ఈ దుర్బల స్థితిని ఆసరా చేసుకొని భారతదేశ అఖండతను దాని ప్రాదేశిక సమైక్యతను విచ్ఛిన్నం చేయాలన్న తలంపుతో వ్యవహరిస్తున్నాయి. దురదృష్టవశాత్తూ ఆవేశపరులైన అస్సామ్ ఉద్యమకారులు ఈ సంగతిని గ్రహించక సంఘ వ్యతిరేక శక్తులు, మతతత్వ శక్తుల ప్రేరణతో ఉద్యమాన్ని హింసామార్గం వైపు మళ్ళించి ఈ దేశంలోంచి అస్సామ్ ఉనికిని, దాని సాంఘిక అస్తిత్వాన్ని వేరు పర్చాలని ప్రయత్నిస్తున్నారు దీని పర్యవసానమే నేడు దాపరించిన అసాధారణ పరిస్థితి. రెండు వందల సంవత్సరాల క్రిందట భారత రాజకీయ సమైక్యతను ముక్క ముక్కలు చేసి మన నెత్తిన కూర్చొని మనల్ని బానిసలుగా శాసించిన బ్రిటిష్‌వారి పథకం ఎలాంటిదో ఈనాడు భారతదేశం పట్ల సామ్రాజ్యవాద శక్తులు అనుసరిస్తున్న వ్యూహం అలాంటిదే. ఈ కుట్రకు మనం బలికాకుండా మనల్ని మనం కాపాడుకోవాలి. అలాగే అస్సామ్ సమస్యను గమనించిన వారికి కేంద్ర-రాష్ట్రాల మధ్య సంబంధాలను వెంటనే పునః పరిశీలించడం అత్యవసరం అన్పిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్నపార్టీ, తన సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు లోను కాకుండా ప్రతీ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలోని జనసంఖ్య, విస్తీర్ణత, భౌగోళిక పరిస్థితి, ఇతర సామాజిక, ఆర్థిక అంశాలు దృష్టిలో పెట్టుకొని తగినన్ని నిధులు ఆ ప్రాంతాల అభివృద్ధికై తక్షణం కేటాయించాలి. వీలైతే కేంద్ర రాష్ట్ర ఆదాయాల సంబంధాల్లో రాష్ట్రాలకు మరిన్ని ఎక్కువ అధికారాలు, ఎక్కువ నిధులు సమకూరేలా రాజ్యాంగ నియమాల్ని తిరిగి రాయాలి. ఇందులో ఏ మాత్రం జాప్యం జరిగినా భవిష్యత్తులో దేశం మరిన్ని అస్సామ్ ఉద్యమాల్ని ఎదుర్కొనవల్సి రావచ్చు.

అస్సామ్‌లో అనధికారంగా ప్రవేశించిన విదేశీయుల పట్ల ఒక రాజకీయ పరిష్కారానికై అస్సామ్ ఉద్యమకారులు, కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించాలి దీనికి రెండు పక్షాల్లో వాస్తవిక దృష్టి, రాజకీయ విజ్ఞత

సంయమనం అవసరం. అస్సామ్‌లో కొన్ని దశాబ్దాలుగా శాంతియుతంగా జీవిస్తున్న వివిధ జాతుల ప్రజల మధ్య విద్వేషాలు రేకెత్తించడం ద్వారా లేదా తుపాకులు గురిపెట్టి ఎన్నికలు జరపడం ద్వారా అస్సామ్ సమస్య పరిష్కారం కాదు. ఒక జాతికి మరొక జాతి ఎన్నడూ శత్రువుకాదు. అలాగే అస్సామ్‌లో జీవిస్తున్న పరభాషా ప్రజలు బూర్జువాలు, దోపిడీదార్లు కారు. భయంతో భీతితో ఇరుగు పొరుగు రాష్ట్రాలకు పారిపోయి వస్తున్న వారందరూ రెక్కాడితే గాని డొక్కాడని సామాన్య ప్రజలు. నిరుపేదలు.

నిరుపేదల మీద నిరుపేదల్ని పురికొల్పే సామర్థ్యం సామ్రాజ్య వాదానిది. దోపిడీ శక్తులది. జాతుల మధ్య వైరం సృష్టించి లౌకిక వాతావరణాన్ని ధ్వంసం చేసి మతపరమైన పాలన ఏర్పర్చాలని పౌరాణిక స్వప్నం కంటున్న మత తత్త్వ శక్తులు దీనికి వంత పాడుతున్నాయి. ఈ రెండు శక్తుల కుట్రకు ధీరోదాత్తులైన అస్సామ్ ప్రజలు బలికాకోడదు. అస్సామ్ సమస్యకు అసలైన పరిష్కారం దాని ఆర్థిక అభివృద్ధిలో ఉంది. అది ప్రయత్నిస్తే ఏర్పర్చుకోగల సామ్యవాద సమాజంలో దాకొనిఉంది.

## సంతాపం

సుప్రసిద్ధ తెలుగు సాహిత్య పరిశోధకుడు, విమర్శకుడు అయిన **శ్రీ బంగోరే** ఆత్మాహుతికి, సుప్రసిద్ధ జర్నలిస్ట్, మేధావి అయిన **శ్రీ చలపతిరావు** అకాల మృతికి సృహ తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తోంది.

## విజ్ఞప్తి

సృహ చందావారులు తమ చందా గడువు ముగిసిన వెంటనే చందా రెన్యూ చేసుకోమని కోరుతున్నాం.

ఆంధ్ర ప్రదేశ్‌లో ఒరిస్సాలో అన్ని ప్రాంతాల్లోనూ కమీషన్ ప్రతిపాదిక మీద సృహను విక్రయించేందుకు విక్రయదారులు కావాలి

సృహ వార్షిక చందా 10/- రూ॥ మాత్రమే

వివరాలకు సంప్రదించండి :

చిరునామా : సృహ, ఆకుల వీధి, బరంపురం-760 002 (ఒరిస్సా)

**సంస్మరణ :**

# సామ్యవాద పితామహుడు
# కార్ల్ మార్క్స్

.... మానవజాతి ఒక మహా శిరస్సును కోల్పోయింది. అది మన యుగంలో అతి పెద్దదైన "శిరస్సు" అని పేర్కొన్నాడు ఏంగెల్స్ 1883లో మార్క్స్ మరణించినప్పుడు ఎఫ్. వి. సోర్జ్ అనే మిత్రుడికి ఒక లేఖ వ్రాస్తూ. ప్రపంచ శ్రామికోద్యమ నిర్మాత, సామ్యవాద సిద్ధాంతకర్త అయిన కార్ల్ మార్క్స్ మరణించి ఈ ఏడాదికి (1983) వంద సంవత్సరాలు పూర్తికావస్తోంది. ఈ సందర్భంగా ప్రపంచగతినే మార్చివేసి ఈ భూమి మీదనే భూతల స్వర్గం సృష్టించడం సుసాధ్యం అని నిరూపించిన ఈ మహావ్యక్తి స్మృతికి మా జోహార్లు అర్పిస్తూ కార్ల్‌మార్క్స్ తన జీవితకాలంలో వెల్లడించిన కొన్ని ఆలోచనలు, అభిరుచులు, అతని కొన్ని ఉత్తరాలు స్రవంతి పాఠకుల కోసం ఈ దిగువ అందజేస్తున్నాం.

## మార్క్స్ ఆలోచనలు

"మానవ జాతికి అత్యధికంగా మేలుచేయగల వృత్తిని మనం ఎంచుకున్నట్లయితే, మనం దేనికీ తలవంచనవసరం లేదు. ఎందుచేతనంటే అది అందరికోసం చేసే త్యాగం. అప్పుడు మనం పొందే ఆనందం అల్పమైనదీ కాదు. ఎందుచేతంటే లక్షలాది ప్రజల సౌఖ్యమే మన సౌఖ్యం అవుతుంది. మన కార్యాలు ప్రపంచంలో శాశ్వతంగా నిలిచిపోతాయి. మన అస్థికలు మహానుభావుల అశ్రుధారలతో పునీతమవుతాయి.



.... ఒక వ్యక్తి తన సొంత మేలుకే పాటుబడితే అతడొక ప్రఖ్యాత సైంటిస్టు గానో, గొప్ప ఋషిగానో, చక్కని కవిగానో తయారుకావచ్చు, కానీ ఎన్నటికీ పరిపూర్ణ వ్యక్తిగా, మహాపురుషుడిగా తయారవడు.

.... తాడికింద మెడపెట్టి బ్రతకడమంటే నాకు పరమరోత — అది స్వేచ్ఛ పేరుతో చెలామణీ అయినా సరే దుడ్డు కర్రతో బాదడానికి బదులు గుండు సూదితో పోరు సల్పడమంటే నాకు పరమ అసహ్యం. నేను కాపట్యం, మూర్ఖత్వం, నియంతృత్వం - వీటితో విసుగెత్తి పోయాను. ఎల్లప్పుడూ సర్దుకుపోవల్సి రావడం, కుదించుకుపోవలసి రావడం, సాగిల పడవలసి రావడం, తప్పులెంచడానికి చేసే ప్రతి ప్రయత్నాన్నీ పరిగణనలోకి తీసుకోవలసి రావడం — వీటితో నేను విసిగి వేసారేను ....

●

ఒక వ్యక్తి ఎద్దుగా బ్రతకదల్చుకుంటే, మానవజాతి యొక్క బాధల్ని అతడు సహజంగా పట్టించుకోడు. తన చర్మం విషయమే అతడెప్పుడూ పట్టించుకొనేది.

(ఈనాడు) మానవుడు అస్వతంత్రుడు. అనగా తన సిసలైన వ్యక్తిత్వాన్ని ఖచ్చితమైన స్వశక్తితో నిరూపించుకోడానికి అతనికి స్వేచ్ఛ లేదు. అటువంటప్పుడు వ్యక్తి చేసే నేరానికి వ్యక్తినే శిక్షించడంకాక, నేరాలకు తావిచ్చే సమాజ వ్యతిరేక మూలాంశాన్ని నిర్మూలించాలి.

●

మానవుడు భౌతిక జీవిత పరిస్థితులు, అతని సామాజిక సంబంధాలు సామాజిక జీవితం మార్పు చెందితే అతని భావాలు, అభిప్రాయాలు, ఆలోచనలు కూడా మార్పు చెందుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అతని చైతన్యం మార్పు చెందుతుంది.

●

గత సమాజ చరిత్ర అంతా వర్గ వైషమ్యాల అభివృద్ధి క్రమం. ఈ వైషమ్యాలు భిన్నయుగాల్లో భిన్న రూపాలు దాల్చాయి. కానీ ఆ రూపాలు ఏవైనా ఒకటి మాత్రం అన్ని యుగాల్లోనూ మనకు కనిపిస్తుంది. అదేమంటే సమాజంలో ఒక భాగం మరొక భాగాన్ని దోచుకోవడం.

## మార్క్స్ రాసిన కొన్ని ఉత్తరాలు

ఫ్రెడరిక్ ఏంగెల్స్‌కి వ్రాసిన ఒక జవాబు (1862)

ప్రియమైన ఏంగెల్స్,

స్కార్లెట్ జ్వరం ఇక్కేరియస్ యొక్క ముగ్గురు బిడ్డల్ని పొట్టన పెట్టుకుంది. అంతేకాక, ఆయన భయంకరమైన దారిద్ర్యంలో ఉన్నారు.

వెంటనే మిత్రుల నుంచి కొంత సొమ్ము సేకరించి ఈ చిరునామాకు పంపండి. సెంట్ గైల్స్ నుంచి పోయే వీధినుంచి అడ్డంగా 22వ ఇల్లు.

అభినందనలతో
కా. మా.

కారల్ క్లింగ్స్‌కి వ్రాసిన ఒక జాబునుంచి (1864)

.... నేను క్రిందటి సంవత్సరమంతా జబ్బు పట్టాను. (రాచకురుపు, గజ్జి) లేకపోతే అర్థశాస్త్రం మీద నేను వ్రాస్తున్న "దాస్ కాపిటల్" పూర్తి అయియుండేది. దాన్ని పూర్తిచేయడానికి రెండు నెలలు పట్టవచ్చు. అప్పుడు నేను పెట్టుబడిదారీ వర్గాన్ని తిరిగి తేరుకోలేనంత గట్టిగా దెబ్బ కొట్టగల్గుతాను. సంతోషంగా ఉండండి. కార్మికవర్గ పోరాటంలో నేనెల్లప్పుడూ అగ్రశ్రేణి యోధునిగా ఉంటాను. ఈ విషయంలో మీకెట్టి అనుమానం అక్కర్లేదు.

కా. మా.

డబ్లు బాస్‌కి వ్రాసిన ఒక జాబు నుంచి (1877)

.... నేను ఏవిధమైన వ్యక్తి పూజ సిద్ధాంతాన్నీ సహించే వాణ్ణికాను కనుక అంతర్జాతీయ కార్మిక సంస్థ పనిచేస్తున్న కాలంలో నన్ను ప్రశంసిస్తూ వివిధ దేశాల నుంచి ప్రకటిత లేఖల రూపంలో వచ్చే అనేక జవాబులు నన్ను గంగవెర్రెత్తించేవి. వాటికి నేను జవాబులు వ్రాసే వాణ్ణికాను. అప్పుడప్పుడు మాత్రం మందలిస్తూ ఉండేవాడిని.

కా. మా.

ఎఫ్. సోర్జ్‌కి వ్రాసిన ఒక జాబు నుంచి (1874)

.... నేను తిరిగి వచ్చాక మళ్ళీ పూర్తిగా పనిచేయగలనని వారు హామీ ఇస్తున్నారు. పశువుకాని ఏ మనిషైనా పనిచేయలేక పోవడం నిజంగా ఉరిశిక్షే ....

కా. మా.

# మార్క్సు విశ్వాసాలు

| | |
|---|---|
| మీకతి ప్రియమైన సద్గుణం | నిరాడంబరత |
| పురుషులలో మీకతి ప్రియమైన సద్గుణం | సశక్తత |
| స్త్రీలలో మీకతి ప్రియమైన సద్గుణం | అశక్తత |
| మీలో ప్రధాన లక్షణం | ఏకాగ్రత |
| సౌఖ్యమనగా మీ భావం | పోరాటం |
| దౌర్భాగ్యస్థితి అనగా మీ భావం | లొంగుబాటు |
| మీరన్నిటికంటే ఎక్కువగా క్షమించే దుర్గుణం | వంచింపబడుట |
| మీరన్నిటికంటే అసహ్యించుకొనే దుర్గుణం | దాసత్వం |
| ఎవరంటే మీకతి చీదర ? | మార్టిన్‌టుప్పర్ |
| మీకతి ప్రియమైన వృత్తి | గ్రంధభక్షణ |
| మీకతి ప్రియమైన కవి | షేక్స్పియర్, ఎచిలస్, గెథే |
| మీకతి ప్రియమైన గద్యరచయిత | డిడెరో |
| మీకతి ప్రియమైన నాయకుడు | స్పార్టకస్, కెప్లర్ |
| మీకతి ప్రియమైన నాయకురాలు | గ్రెషెన్ |
| మీకతి ప్రియమైన పుష్పం | దీఫ్నె |
| మీకతి ప్రియమైన రంగు | ఎరుపు |
| మీకతి ప్రియమైన పేరు | లారా జెన్నీ |
| మీకతి ప్రియమైన వంటకం | చేప |
| మీకతి ప్రియమైన సూక్తి | మానవ లక్షణం గలదేదీ విజాయితీయం కాదు |
| మీకతి ప్రియమైన మూలసూత్రం | ప్రతి వ్యక్తీ ప్రతిదాన్ని శంకించాలి |

● కమ్యూనిస్ట్ నీతి సౌజన్యంతో

వరద కథ :

# వరదరాజులం

మహీధర రామశాస్త్రి

వరదరాజు ఏటిగట్టు ఎక్కి పెద్ద మర్రి క్రింద కొచ్చేడు' ఏటి గాలిని పూటుగా పీల్చుకుని లంకపుగాకు చుట్టని పళ్లకింద త్రిప్పుకుంటూ నిలబడ్డాడు. చుట్ట తిప్పు తున్న వేళ్లకు రాళ్ల వుంగరాలు వున్నాయి. ఆ రాళ్లలో సూరీడు తన ముఖం చూసుకుంటున్నాడు. అప్పుడా రాళ్లు అచ్చం వరదరాజు గోల్డు ఫ్రేం కళ్లజోడు లా మెరిసేయి ! ఆ మెరుపు చూసి సిగ్గు పడ్డ సూరీడు ముఖాన్ని ఒదగడ్డలా మార్చుకుని కృంగిపోతున్నాడు.

చుట్ట పొగని హాయులు హాయులుగా వదుల్తూ కళ్లజోడు లోంచి ఏటికేసి నిశితంగా చూస్తూ వరదరాజు అడిగేడు

"ఏరా ! నారిగా ! ఆ వస్తున్నది నావకాదంటావా ?"

వరదరాజు ధరించిన సిల్కు లాల్చీ జిగ జిగల్ని లాల్చీకి పులుము కున్న "మురికొళుందు" ఘుమ ఘుమల్ని అనుభవిస్తున్న నారిగాడు ...

"రేత్తిరి సూసిన చిన్మాలో దేవరాయలు పైజామా లాల్చీ యేసుకుని, పాగా తీసేసి కళ్లజోడెట్టుకుని యిలా వచ్చి లేదు గందా ?" అని !

పరాకు చిత్తగిస్తున్న నారిగాడు వరదరాజు మాటకి వెంటనే బదులు చెప్పలేదు !

వరదరాజు వెనక్కి తిరిగి చురుగ్గా చూసి నిద్దరోతన్నావేంట్రా" అన్నాడు కరుగ్గా.

"అయ ! లేదండి ! ఏటండి ?"

నారిగాడు సర్దుకున్నాడు.

"ఆ వస్తున్నది నావే నంటావా?"

సందేహ మెందుకండి ? నావే నండి !"

"మరి సూడు !"

అని చెప్పేసి వరదరాజు మర్రి క్రింద పెద్దరాయి మీదకొచ్చి కూర్చున్నాడు కాలుమీద కాలేసుకుని ! మీదనున్న పాదం — చెర్లో చేపల్ని పట్టుకుతినే పాలపిట్టలా గాలిలో ఆడుతూంది ! చేప దొరికే వరకూ అలా గాలిలో నిశ్చలంగా ...

పాలపిట్ట ! చేపనీటి మట్టానికి రాగానే టుక్కున రాయిలా పడి చేపను ముక్కున కరచుకుని ఎగిరి పోతుంది! గట్టుమీద రావి చెట్టు మీద తన గూడులోకి పోతుంది. అక్కడ దాన్ని చంపి పాలపిట్ట తన రాజుతో తనూజ లతో కలిసి నాజూగ్గా నంజుకు తింటుంది !

వరదరాజు పాదం కూడా గాలిలో వూగడం ఆగిందంటే అర్థం నావ నీటి వొడ్డుకు వచ్చిందని.

వరదరాజు లేచి నీటి వొడ్డుకు వచ్చేడు. నారిగాడు లాంటి యితరత్రా మనుషుల సాయంతో నావలోని సరుకంతా పరీక్షించేడు. జులుం చెలాయించేడు. పొగరు మోతుతనం ప్రదర్శించి భయపెట్టి వాళ్ళని లొంగ దీసుకని వాళ్ళ సరుకల్లో కొంత భాగం సంగ్రహించేడు. అవి బియ్యం కావచ్చు, అరటి గెలలు కావచ్చు, కొబ్బరి కాయలు కావచ్చు, బెల్లం కావచ్చు మరేదయినా కావచ్చు.!

వరదరాజుకిది దినచర్యగ మారి చాలా కాలం అయింది. వరదరాజుకి యీ ముడువులు చెల్లించాల్సిందే !

అక్కడికి సముద్రం పదిమైళ్ళు ఉంటుంది.

దొంగ రవాణా కూడా జరుగు తూనూ వుంటుంది.

"బియ్యం దొంగ రవాణా చేస్తున్నా వని కేసు పెడతా లంజ కొడకా ! బొక్కలో కూర్చుంటావు !" అని బెదిరిస్తాడు వరదరాజు.

కండబలం చూపించి గుండా గిరీకి దిగడానికి నారిగాడు లాంటి మనుషులున్నారు. ఏటి వొడ్డున గలాటా ! ఎవరితోనయినా చెప్పుకని మొర పెట్టుకుందామంటే వరదరాజు ఆ వూరికి మునసబు !

కాబట్టి నావలవాళ్ళు రేవు సుంకంలా వరద రాజుకి ముడుపులు చెల్లించేస్తూ వుంటారు.

ఈ ముడుపుల ముచ్చట్లు కను చీకట్లు పడేవరకూ సాగుతాయి !

తర్వాత -

మాటలు యింటికి చేరతాయి !

వరదరాజు యిచ్చిన చిల్లర డబ్బులు నారిగాడి రొంటికి చేరతాయి ఆ తర్వాత అవి గ్లాసుడు సారాగా మారి నారిగాడి శరీరంలో ఆవిరిగా యింకిపోతాయి !

× × × × ×

"అప్పన్నా తనా మనా మాలోరి బైరన్నా !

హోయ్ ! హోయ్ ! అప్పన్నా !

హోయ్ ! హోయ్ ! అప్పన్నా !

తన్నా ? మన్నా ! "

నారిగాడు పాడుకుంటూ, తూలు కుంటూ వస్తున్నాడు గుడిసె దగ్గర

ఆరుబయట చింతచెట్టు క్రింద ఎంకి వంట చేస్తూంది. చుట్టూ చీకటి. కీచు రాళ్ళు గీగా మంటూ రొద చేస్తు న్నాయి.

మంట వెల్తురులో ఎంకి ముఖం కనిపిస్తూంది. చీకట్లోంచి నారిగాడి పాట వినిపించి అటు చూస్తూంది ఎంకి.

"వంటయిపోనాదేటే ? సెల్లె ? కూరేటి ? కోడిగుడ్డా ? రొయ్య సేపలా ?"

"నీయదం ! సిగ్గులేదు మొకానికి! ఆ బాబెనకాలబడి యేటి నావలు దోచుకుని డోసుమీద రావడం తప్ప నీకేం పన్లేదు ! అయిగారి సంపాదన బలిసిపోనాదని కోడి గుడ్డు కూర, రొయ్యి పొట్టు సారూ ఎట్టి, ఏణ్ణీళ్ళు క్యాచి ఎదురు సూత్తన్నా ! రా !"

"అదంటే ? ఎంకి ! అన్నేయంగా సన్నెందుకే ఆడిపోసుకుంటావు ? నాదేం తప్పు ? మన బాబు జీవిత వంతా ఆ పెదబాబు సేవ జేసి మంచాన పడ్డాడు ! నేను యీబాబు సేవ జేసుకోవడం తప్పా ? మన ఒతుకులు అరిసేతుల్లో వుండగా అళ్ల నాడి పోసుగోడం తగదే !"

నా రి గా డు ఎంకిపక్క కొచ్చి ప్పొయ్యిదగ్గరగాకూర్చున్నాడు. వాడి స్థితికి జాలి కలిగిన ఎంకి అంది.

"సూడన్నా నీకు తెల్దు ! ఆ బాబు అన్నాయాలకి సాయం జెయ్యడం తప్ప మరేం పనేలేదా ? కష్టపడి నాయంగ నాలుగు రూపాయలట్టు గొచ్చినా మన ముగ్గురి కడుపులూ నిండతయి ! అదు ముసిలాడు మంచాన పడ్డాడు. కన్నానదు ! ఈ వుదయం నుంచి జొరం అట్టాగే ఒదిలేసి పొలం పనికి పోయినేనొచ్చి చూసినా. అయాసంతో రొప్పు తున్నాడు నువ్వు రావయితివి. పాక సుట్టుతా నీరొచ్చేనాది ! ఏటా యీ వరదలొచ్చి తలికి మన పేనాలు పోతున్నాయి ! గతసాలు అమ్మ నట్టుకు పోనాది గోదారి తల్లొచ్చి ! మరి యీ పాలి బాబునట్టుకు పోత దేమో ! భయంగా ఉంది"

"ఏంటే ఎంకీ ఆ మాటలు ?"

"అవున్రా అన్నా ! నేనంటే నీకు కష్టంగుంటది ! గతపాల ముసిల్ది పోయినప్పుడు మన గూడెంల ఎందరు పోలేదు ? ఎన్ని గుడిసెలు పోలేదు ? నువ్వు కొలవు సేత్తన్నా బాబు ఏటన్నడు ? మన గూడేల కవతల యేటిగట్టు కాడ లాకు తలుపు లెట్టి గట్టు ఎత్తు చేస్తే గూడెంకి సుక్క నీరు దిగదన్నాడా లేదా ? అన్నాడు ! ఆ బాబన్నాడు. జీపు లొచ్చిన బాబులంతా ఆ మాటల న్నారు ! అంటానే వున్నారు !

గుడిసెలయితే కూలిపోతయి ! గొప్ప భవంతులు కట్టిస్తవన్నారు ! అన్నెప్పి పెతీయేటా వందా యాబయ్యి సేతు లెట్టి ఏలి ముద్దర్లు ఎయ్యిచ్చు కుంటున్నారు ! అబద్దవా ? సూడు ! ఈ యేడు మాత్రవేటయింది ? మామూలుగ నీరొచ్చి గూడేన్ని గుడిసిని లేపుకుపోతదో తెల్దంలేదు ! ఆ ముసిలాడు మంచాన పడ్డాడు. నువ్విలాగ రోడ్డున పడతున్నావు ! కోపం తెచ్చుకోకురన్నా ! మన బతుకులు మనమే బాగుజేనుకోవా ల్సిన్నా ! ఆ బాబెనకాల తిరిగితే ఆ బాబు బాగ్గెం వస్తదనుకునేవు ! బుగ్గే మిగులుద్ది ! ”

“ఊ....రు....కో....వే !”

దగ్గ తెరల్లోంచి ముసిలాడు నీర సంగా గుడిసిలోంచి బాధగా అన్నాడు

నారిగాడు ‘తన’ లోంచి “మన” లోకి వచ్చి పడ్డాడు.

లేచి ఒళ్ళు విరుచుకుని గుడిసెకేసి నడిచేడు.

“బోదిమీద కాలు జాగరత ! కర్రలు కదల్తన్నాయి !”

వెనకనుంచి ఎంకి హెచ్చరించింది

“ఫరవాలేదే !”

అంటూనే నారిగాడు దబ్బున బోదిలోకి పడ్డాడు.

“దీనెమ్మ ! నీ రెక్కువయి కర్రలు కొట్టుకు పోనాయే ! సీకట్లో కన్నానింది గాదు !”

“నీరొస్తదని తెల్సా ! సుట్టూ అంతా సీకటని తెల్సు ! మరి ఒళ్ళు కాత్త దగ్గరెట్టుకుని అడుగు జాగరతగా ఎయ్యిరాల్సి ఎర్రినాయినా ?”

“సత్తాంటే నీ గొలేంటే ?”

“పూరితిగా ఎక్కడ సచ్చిపోతా వోననేరా నాగోల! సచ్చిలోగానయినా కళ్లు కాత్త తెరు !”

“సర్లేయ్యే !”

అంటూ కాలు కూడదీసుకుని బోదిలోంచి బయటపడి నీళ్ళలోంచి గుడిసెలోకి వచ్చేడు. గుడిసె చుట్టూ నీరు. మరో అడుగు నీరొస్తే గుడిసి లోకి నీళ్ళొస్తాయి.

నారిగాడు లోపలి కొచ్చి చూసేడు మంచం మీద ముసలాడు ఆయాసపడుతూ కనిపించేడు ముట్టు కుని చూసేడు. శరీరంలో రక్తం ఎసరులా మరుగుతూంది.

నారిగాడు తలగోక్కుంటూ చెంగున బయటకు చూసేడు — ఏటి సెయ్యా డవాం ? అని.

ఎంకి అన్నం వారుస్తూంది.

పొయ్యి మంటలో అవిరి సెగలు కనిపిస్తూన్నాయి. బుర్రలో ఆలోచనల సెగబయులేరింది.

అర్ధరాత్రి ప్రసవ వేదన పడి పడి నిండు చూలాలు ప్రసవించినట్లు ఏటి గట్టుకు గండి పడింది. శివలింగం పగిలినట్లు ధ్వని! ఏడుకొండల మెట్లు విరిగి దొర్లుతున్నట్లు హోరు! క్షణంలో జలప్రళయం! ఆ నిశీధిలో ఊరు యేరై పొంగింది. ఆ పొంగుల సుడి గుండాల్లో గుడిసెలు రంగుల రాట్నాల్లా తిరిగేయి! పాకలు పడవల్లా తేలాయి! ఇళ్ళ కప్పులు నావల్లాగ సాగాయి!

నారుపోసిననాడే నీటిమీద తేల్చి తోలుకు పోతున్నాడు జీవరాశుల్ని! గజాలకు గజాలు కొట్టుకుపోతు న్నాయి. ఆ ఉపద్రవంలో పడి సముద్రం వైపుగా కొట్టుకుపోతున్న నారిగాళ్ళ కేకలు, ఆక్రందనలు ఏ నాయకుల చెవిన బడతాయి?

అసలే వయోభారంవల్ల బధిరత్వం వచ్చేసింది! దానికితోడు నాయకులు ఆకాశంలో విహరిస్తున్నారు; హెలి కాప్టర్లనుంచి వీక్షించే మహానాయకు లకు సహాయం కోసం అంచే దీనుల అరుపులు వినిపిస్తాయా? చాచే చేతులు కనిపిస్తాయా?

ఆకాశం నుంచి పప్పు బెల్లాల పొట్లాలు గాలిలో వదిలిస్తున్నారు! ఆ పొట్లాలయినా అమడ దూరాన అందనంత చోట వెళ్ళిపడుతున్నాయి

అన్నార్తుల కన్నులు కన్నాలవు తున్నాయి.

మామూలుగా సూర్యుడు లేచాడు క్రితం రోజు కొంపల జాగాలో నేడు దిబ్బల్ని చూస్తున్నందుకు, పండిన చేల మీద యిసుకమేటలు మెరుస్తున్నందుకు సూరీడు విస్తు పోతున్నాడు.

క్రమంగా నీరు తీసింది. బతికి బయటపడ్డ జీవాలు తమ తమ నెల వుల్ని వెతుక్కుంటున్నాయి.

నారిగాడు ఆకాశం నుంచి జారి పడ్డట్టు గూడెంలోకి వచ్చిపడ్డాడు. గూడెంవే లేదు. తన గుడిసి వుండా ల్సిన చోట మోకాళ్ళమీద తలపెట్టు కుని యేడుస్తూన్న ఎంకి కనిపించింది నారిగాడిని చూడగానే కౌగలించు కని బావురుమంది.

"ఊరుకో! ఊరుకో!" మంటూ వోదారుస్తున్నాడు. ఏడుస్తూనే వుంది.

"అన్నా! నా మాట నిజమయి నాది! ఈ వరదలకి బాబెల్లి పోనాడు! ఇక మనిద్దరంవున్నావుం! మరి రెండొ రదలు సాలు మనకి!"

నారిగాడు నీరసంగా ఎటో చూస్తూ అన్నాడు.

"అదుగో బాబు లొస్తున్నారు! మన కోసవేం ఒస్తున్నారు!"

వరదరాజు, మరికొన్ని పంట్లా
వులూ, బుష్‌కోట్లూ, ఖద్దరు టోపీలు
వాళ్ళకేసి వడివడిగా వస్తున్నారు !
వస్తున్నారు ! వస్తూనే వున్నారు !

నిటారుగా నిలబడ్డ నారిగాడు,
ఎంకి పిడికిళ్ళు బిగించి నిలబడ్డారు,
వాళ్ళ తీరును గమనించిన వరద
రాజు ముందుకు రావడానికి తటపటా
యిస్తున్నాడు !

---

## పోరాటం

**టి. శాంతారామ్, (టెక్కలి)**

నేస్తం ! కలలలో బతికే నీకు
జీవితం రంగుల సినిమా అనిపిస్తోంది
భ్రమలో పడి బాధ్యత మరిచే నీకు
జీవితం పూలబాటగా కనిపిస్తుంది
కాని నేస్తం !
ఒక్కసారి, ఒకే ఒక్కసారి
భూతద్దంలోంచి చూడు జీవితాన్ని
నిన్ను వెక్కిరిస్తూ వికృతంగా
నవ్వుతూ నీ ముందు నీ కష్టాలు
భూతంలా భయపెట్టే బాధలు
నీ ముందు సాక్షాత్కరిస్తాయి
ఒక్కసారి పూరి గుడిసెల
వైపు చూసావంటే
జీర్ణావస్థలో కొట్టుమిట్టాడుతున్న
బతుకులు దర్శనమిస్తాయి
ఇన్ని చూపిన నీకు
జీవితమంటే భయంగా వుందా ?
నేస్తం !
జీవితం అంటే భయం కాదు
కష్టాల్ని సుఖాలుగా మార్చుకొనే
ఆరాటం
జీవితం ఒక అంతులేని పోరాటం

## రాత

**శివల జగన్నాధరావు**

ఈ పండక్కేమీ రాయలేదు
గోడలకి సున్నాలు గాని
గుమ్మాలకి రంగులు గాని
కాయితమ్మీద కధగాని
ఇవెలా రాసేది ?
డాక్టరు బిల్లులాస్తోంటే !
కిరాణావాడు పద్దులాస్తోంటే !
పై వాడి రాత
నా బతుకులో
సుఖం కోత
నష్టాల్తో రాని ఊత

## ఉద్యమం

**దొడ్లంకి వెంకటారావ్**
**(పార్వతీపురం)**

చినుకు చినుకూ చిలికి వానౌతుంది
వాన పెద్దదై వరదౌతుంది
వ్యక్తి వ్యక్తి చేర వెలుగౌతుంది
వెలుగురేఖలు మండి
ఉద్యమం ఔతుంది

# శ్రీ ఎండమూరి వీరేంద్రనాథ్‌తో ఇంటర్వ్యూ

నిర్వహణ : ● స్రృహ

ఫిబ్రవరి 27వ తేదీ ఆదివారంనాడు బరంపురంలో స్థానిక సాహితీ సంస్థ వికాసం వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీ ఎండమూరి వీరేంద్రనాథ్ వచ్చారు. ఈయన రాక బరంపురంలో పెద్ద దుమారం రేపింది. మొదటిసారిగా బరంపురం గోడలమీద క్షుద్ర సాహిత్యానికి వ్యతిరేకంగా నినాదాలు వెలిసాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్రృహ వీరేంద్రనాథ్‌ని ఇంటర్వ్యూ చేయసంకల్పించింది. మొదట శ్రీ వీరేంద్రనాథ్ ఇంటర్వ్యూకు ఒప్పుకోలేదు. రెండుమూడు సార్లు అడిగి లేదన్పించుకొని చివరకు ఎంతో అభ్యర్ధనమీద స్రృహ ఆయనచేత ఇంటర్వ్యూకు ఒప్పించగల్గింది Tape recording కి ఆయన అంగీకరించని కారణంగా ఆయన కోరికమీద స్రృహ ఒక ప్రశ్నావళి పత్రం తయారుచేసి ఆ దినం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక Berhampur Rest House లో ఆయన రూమ్‌కి వెళ్ళి ప్రశ్నావళి పత్రం అందజేసింది ఆయన ఆ ప్రశ్నావళి పత్రంలో ప్రతీ ప్రశ్న క్రింద తన సమాధానాలు రాసి సాయంత్రం ప్రకాశం హాల్లో బహిరంగ సభ ముగిసేక తనదగ్గరకొస్తే అందజేస్తానని చెప్పారు. స్రృహ అలాగే బహిరంగ సభ ముగియగానే ఆయన జవాబుల కోసం అడిగితే ఆయన ఆ కాగితాన్ని అందించారు. కాని ప్రశ్నావళి పత్రంలో ప్రశ్నలక్రింద సమాధానాలు ఆయన స్వంత దస్తూరీలో లేవు. జవాబులు రాసిన ప్రశ్నావళి పత్రంక్రింద ఆయన సంతకం కూడాలేదు. సంతకం ఎందుకు పెట్టలేదని అడిగితే చాలాపత్రికలవాళ్ళు తన సమాధానాల్ని వక్రీకరించి వేస్తున్నారని, ఒకవేళ స్రృహ కూడా అలాగేచేస్తే తను ఇంటర్వ్యూ ఇవ్వలేదని Disown చేయడానికి అవకాశం ఉంటుందని ఆయన బదులు చెప్పారు. గడచిన రెండేళ్ళలో స్రృహ మహాకవి శ్రీ శ్రీ, డా॥ సి. నారాయణరెడ్డి, శ్రీ వంగపండు ప్రసాద్, శ్రీ చాగంటి సోమయాజులు, ప్రొఫెసర్ నాగరాజ్, డా॥ ఉప్పల లక్ష్మణ రావు లాంటి ఎందరో ప్రముఖులతో ఇంటర్వ్యూ నిర్వహించింది. కానీ

వీరెవరూ స్ప్రుహ మీద గాని, స్ప్రుహ పత్రికలో వెలువడిన జర్నలిజం మీదగాని ప్రశంసలు తప్పితే ఎటువంటి సందేహాలు వ్యక్తం చేయలేదు. కానీ మొదటిసారిగా శ్రీ వీరేంద్రనాథ్ గారికే ఇలాంటి అపోహ ఏర్పడి నట్టుంది, ఎందుకో మరి కారణాలు మాకు తెలియవు.

స్ప్రుహ "సత్యానికి" "యధార్థానికి" కట్టుబడిన ప్రజల పత్రిక. ప్రజలకు నిజాన్ని యధాతథంగా తెలియజేయడమే దాని లక్ష్యం. బ్లాక్-మెయిల్ చేసే జర్నలిజం మీద, చవకబారు జర్నలిజం మీద స్ప్రుహకు విశ్వాసంలేదు. స్ప్రుహను ఆ విధంగా వీరేంద్రనాథ్ గారు ఊహించడం విచారకరం ఆయన అపోహ అబద్ధమని తెలియజేసేందుకు ప్రశ్నావళి పత్రం కింద ఆయన సంతకం పెట్టకపోయినప్పటికీ ఒక వర్గం పాఠకుల్లో పాపులారిటీ సంపాదించుకున్న ఈ రచయిత సామాజిక ప్రాపంచిక దృక్పధాన్ని తెలుగు పాఠకులు తెల్సుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని భావిస్తూ రిస్కు తీసుకొని స్ప్రుహ పాఠకుల కోసం ఆయన ఇంటర్వ్యూని ఈ దిగువ ప్రచురిస్తున్నాం.

ప్రశ్న ; మీరు ఎన్నాళ్ళుగా సాహిత్యరచన చేస్తున్నారు ?

మీ రచనల నుంచి మీరెలాంటి ప్రయోజనాన్ని ఆశిస్తున్నారు ?

జవాబు : పదిహేను సంవత్సరాల నుంచీ ! రచయితగా నేను సంతృప్తి పొందటాన్ని ! !

ప్ర : మీకు ఒక సిద్ధాంతం, నిబద్ధత లాంటివి ఏవైనా ఉన్నాయా? కాస్త వివరణ ఇస్తారా ?

జ : తెలుగులో అనిబద్ధ (Absurd) రచనలు రావాలని ఆశించే వాళ్ళలో నేనొకణ్ణి. అనిబద్ధతకి గురువైన ఐనెస్కోకి నేను ఏకలవ్యుణ్ణి.

ప్ర : ప్రస్తుత సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మీ అవగాహన ఏమిటి ?

జ : డబ్బు టుది పవర్ అఫ్ డబ్బు చదవండి.

ప్ర : సోషలిజంపై మీకు నమ్మకం ఉందా ? ఉంది / లేదు అని ఒక్క మాటలో జవాబు చెప్పండి ?

జ : ఉంది, లేదు. (సోషలిజం అర్థాన్నిబట్టి)

ప్ర : సాహిత్యంలో మిమ్మల్ని ప్రభావితం చేసిన రచయిత లెవరు?
జ : నిరంతరం చేస్తూనే వుంటారు. మంచి రచన చేసే వాళ్ళందరూ! తిలక్ నుంచి సిడ్నీ షెల్డాన్ వరకూ.

ప్ర : మీ సాహిత్య జీవితానికి, వ్యక్తిగత జీవితానికి ఉన్న సంబంధం ఎలాంటిది ?

జ ; రచయితకి, రచనకి ఉన్న లాంటిది.

ప్ర : వాస్తవాలకు దూరంగా సాహిత్య రచనలు చేసే రచయిత/త్రు ల సాహిత్యంపై మీ అభిప్రాయం ఏమిటి ?

జ : అందరగా పాపులర్ అవుతారు. కానీ అందరూ కాలేరు. అవ్వాలని అందరూ కోరుకుంటారు అవ్వలేనివాళ్ళు అయినవాళ్ళని విమర్శిస్తూ ఉంటారు.

ప్ర : క్షుద్ర శక్తుల్ని మీరు నమ్ముతారా ?
నమ్ముతాను/నమ్మను అని ఒక్కమాటలో జవాబివ్వండి ?

జ: ఒక్క మాటలో జవాబివ్వడం కష్టం మూడు మాటల్లో చెబుతాను. క్షుద్ర శక్తుల మీద నా అభిప్రాయం పూర్తిగా రాస్తే అది తులసీదళం, తులసి అంత అవుతుంది (మూడు వాక్యాలు)

ప్ర ; క్షుద్ర శక్తుల్ని మీ తులసి, తులసీదళం నవలలకి వస్తువుగా ఎందుకెంచుకున్నారు ? ఏ ప్రయోజనాన్ని ఆశించి ఈ నవలలు ప్రారంభించేరు ? ఆ ప్రయోజనం నెరవేరిందా ?

జ : ప్రతి నవలకీ ఏదో ఒక Subject తీసుకోవాలి గాబట్టి. పాఠకుల మానసిక ఉల్లాసం. నెరవేరింది.

ప్ర ; "తులసీదళం" 103వ పేజీలో మీరు భువనేశ్వర్‌కు వంద మైళ్ళ దూరంలో ఉన్న ఒక గ్రామంలో ప్రతి మూడో ఇంటికి ఓ మంత్రగాడున్నాడని రాసారు. అక్కడే మీరు "దార్కాసాహు" అన్న మంత్రగాణ్ణి కల్సుకున్నానని రాసేరు. ఆ గ్రామానికి మీతో పాటు ఇంకెవరొచ్చారు ? ఆ గ్రామం అసలు పేరు, దారి, ఆ వివరాలు తెలియజేసారా ?

జ : కటక్ మురికాల్వల పక్కన హోటల్లో, మొదటి అంతస్తులో నా ఒళ్ళు పట్టిన వాడు రాత్రి తొమ్మిదింటికి ఒక పల్లెకి తీసుకెళ్ళేడు. నేను కల్పుకున్న వాడిపేరుని దార్కా సాహుగా మార్చేను. కటక్ మెయిన్ రోడ్ అవతల నాలుగు కిలోమీటర్ల దూరంలో ఓ పది పూరి గుడిసెలున్న ప్రాంతం అది. పేరు తెలియదు. మిగతాదంతా Fantasy

ప్ర ; తులసీదళం, తులసి నవలల్లో మూఢ నమ్మకాల్ని, సైన్స్‌ని సమాంతరంగా నడిపించినా, నవల పూర్తిచేసిన పాఠకుల మీద మూఢ నమ్మకాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అసలు నవలల్లో మూఢ నమ్మకాలకి సైంటిఫిక్ రీజనింగ్ ఇచ్చినా అవి పదింటికి ఐదు చోట్ల మాత్రమే ఇచ్చారని వనవస్తున్న విమర్శలకి మీ సమాధానం ?

జ : ఈ సారి మూఢ నమ్మకాల మీద మరో నవలంటూ రాయాల్సి వస్తే చందమామ కథల్లోలాగా అసలు రీజనింగే యివ్వను సరేనా ?

ప్ర : తులసీదళం నవల్లో "తులసి" కాదా) చావడం వల్ల బ్రతికిందా ? లేక సైన్స్‌వల్ల బ్రతికిందా ? ఒక్క మాటలో జవాబు చెప్పండి ?

జ : తెలీదు.

ప్ర : "కళ కళ కోసమే'' అన్న నినాదంపై మీ అభిప్రాయం ఏమిటి ?

జ : అది నినాదం మాత్రమే !

ప్ర : వెన్నెల్లో ఆడపిల్లలాంటి లవ్‌స్టోరీస్ వల్ల, ఇటీవల ఆంధ్రప్రభ వీక్లీలో "నాలుగు కాలమ్స్'' సీరియల్ వల్ల మీరెలాంటి ప్రయోజనాన్ని ఆశిస్తున్నారు ?

జ : పాఠకుల మానసికోల్లాసం

ప్ర : స్పృహ పాఠకులకి, యువరచయితలకి మీరిచ్చే సందేశం ఏమిటి ?

జ : స్పృహలాంటి పుస్తకంలో యిలాంటి కమర్షియల్ రచయితల ఇంటర్వ్యూ ప్రచురించవద్దని

# తులసి. తులసీదళం' నవలల గురించి మరికొన్ని నిజాలు

## ఒరిస్సాలో మంత్రగాళ్ల గ్రామం ఏది ?

తులసీదళం నవలలో శ్రీ వీరేంద్రనాథ్ తాను ఒరిస్సాలో భువనేశ్వర్‌కి వందమైళ్ల దూరంలో ఒక పల్లెటూరికి వెళ్ళానని అక్కడ ప్రతీ మూడో ఇంటికి ఒక మంత్రగాడుంటాడని, తానక్కడే దార్కా సాహు అనే మంత్రగాడిని కల్సినట్టు చెప్పారు. (ఇది రచయిత స్టేట్ మెంట్-నవలలో ఒక భాగం కాదు) కానీ 27-2-83 సాయంత్రం బరంపురం ప్రకాశం హాలు సభలో మాట్లాడుతూ ఆయన తాను భువనేశ్వర్ వెళ్ళలేదని, కటక్ మెయిన్ రోడ్డుకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఒక పది పూరి గుడిసెలున్న పల్లె ప్రాంతానికి వెళ్ళానని, అక్కడ తాను కల్సుకున్న వ్యక్తినే దార్కా సాహుగా నవల్లో చిత్రించినట్టు చెలియజేసారు. కానీ మునపటిలాగే ఆ ఊరు పేరేమిటో దాని ఇతర వివరాలేమిటో తెలియజేయలేదు.

## ఒరియా వాక్యాలు :

తులసి నవలలో శ్రీ వీరేంద్రనాథ్ ఒకచోట రైలు ప్రయాణంలో కాద్రా, మరోవ్యక్తి ఒరియాలో సంభాషించినట్టు కొన్ని ఒరియా వాక్యాలు రాసారు. నిజానికి ఆ వాక్యాలు ఒరియా భాషలో కాగడా పెట్టి వెతికినా కన్పించవు. ఈ విషయం గురించి కూడా ఆయన ప్రస్తావిస్తూ తానొకసారి కలకత్తా వెళ్ళినట్టు అక్కడొక బెంగాలీవాడు తనకు ఒరియా తెల్సున్నట్టుగా తనను భ్రమింపజేసి బెంగాలీ భాషకే కొన్ని అదనపు పదాలు చేర్చి రాసిస్తే దాన్నే తాను ఒరియా భాషగా భావించి యధాతధంగా నవల్లో చేర్చానని సభికుల ముందు నవ్వుతూ వెల్లడించారు.

---

# మధ్యతరగతి దోపిడి

● ఆనందరావు (రాయగడ)

అవి నేను భువనేశ్వర్‌లో పనిచేసే రోజులు. అద్దె ఇంటి కోసం అంతలేసి కన్నులతో వెదుకుతున్నాను. ఒరిస్సా రాజధానిలో ఏదిదొరికినా, దొరక్కపోయినా అద్దె ఇల్లు దొరకడం అంత సులభం కాదు. ఇంతలో ఎమర్జన్సీ రోజులు ముగియడం, జనతా ప్రభుత్వం పాలనలోకి రావడం జరిగింది. ఇక గవర్నమెంటు క్వార్టర్సు అద్దెకి ఇవ్వడం మొదలెట్టారు కొంతమంది సర్కారుద్యోగులు. ఆరు మాసాల అద్దె ఒకేసారి చేతిలో పోసి ఒక టూ రూమ్‌డ్ క్వార్టరు సంపాదించగలిగాను. ఆ తర్వాత శ్రీమతిని, బాబును తీసుకు వచ్చేసాను. మా సంసారం సుందరా కాండలా సాగుతోన్న సమయాన ....

ఒక రోజు ఉదయాన్నే శ్రీమతి నిద్రపోతున్న నన్ను తట్టిలేపింది తెలుగు సినిమాలోలాగా జడపట్టి లాగి గుండెల మీదుగా లక్కునే ప్రయత్నాన్ని విదిలించి "మీ సరసం చాలు గాని లావెట్రీ జామ్ అయిపోయింది. చూద్దురుగాని లేవండి" అంది అరవిందదళ నయన ఉరఫ్ మా శ్రీమతి. "రైరో" అంటూ లేచి చూద్దును గదా లావెట్రీలో నేల మీద మొజాయిక్ టయిల్స్ పరిచారా, బంగారం రేకు తాపడం చేసారా అన్న విషయం తెలియడానికి వీలు లేనట్టుగా నీరు.... ఎర్రటి నీరు. ప్రశ్నార్థకంగా అర్ధాంగి మొహం చూసాను. భీత హరిణేక్షణ భీతిగా చూసింది. "ఎలాగండి బాబిగాడు తప్పటడుగులు వేస్తున్నాడు. ఇలా వచ్చేస్తాడేమో" తన భయాన్ని ప్రకటించింది ఆవిడ. దాంతోపాటు ఆ నీరు అలా అలా ఇల్లంతా పేరుకొని, దాన్నుంచి తోక పురుగులు, మొసళ్ళు రకరకాలు వస్తాయేమో నని కథలు చెప్ప సాగింది. నా ఖర్మకొద్ది దొరికిందిరా ఈ పెళ్ళాం అనుకొన్నాను. ఈ మధ్య ఆవిడగారు హారర్, తాంత్రిక కథలు రాస్తున్న రచయితల రచనలు చదవడం ఆరంభించింది. కళ్ళకలక రోగికి లోకం ఎర్రగా కనపడినట్లు, మా ఆవిడ కళ్ళకు కాస్మోరాయే కనపడుతున్నాడు.

ఇక ఉంటే నా మర్యాద దక్కదని నోరు కడుక్కోకుండానె పాచి నోటితో బయల్దేరాను. ఆ వీధి మొగంతో ఒక టీ కొట్టుంది. జనం....

ఏమిజనం ! అంతా టీ కోసం వచ్చి నట్లుంది అంతా టీని అరమోడ్పు కనులతో ఆస్వాదిస్తున్నారు. టీకొట్టు వాడు పలకరింపుగా "టీ కావాలా సార్" అన్నాను. 'ఊఁ' అనబోయి అంతలోనే "తోటీ" అన్నాను. వాడు "అస్సాం టీ, డంకన్ టీ, బ్రూక్ బాండ్ టీ, లిప్టన్ టీ లాంటివి విన్నాడు కాని నేను చెప్పే పదం వాడికి వింతగా విన్పించింది. తోటీ బోయ్ అంటే పాకివాడు అన్నాను. ఆ పదం వినపడీ, వినపడగానే ఒకడు నా ముందు హాజరయ్యాడు. "ఏంటి బాబయ్యా ! పాకీవాడు అంటున్నారు అన్నాడు. "అవునోయ్ మా లెవెట్రీ బాగు చెయ్యాలి" అన్నాను. "యురేకా" అని ఆర్కిమెడీస్ ఎందుకు అన్నాడో ఇక్కడ అప్రస్తుతం నాకు వాడు పేదకు దొరికిన పెన్నిధిలాగా కన్పించాడు. వాడితోపాటు వాడి ఆడది కూడ వెంట వచ్చింది. ఆ ఇద్దరు లావెట్రీలోనికి వెళ్ళిచూసారు. ఐదు నిమిషాలు పాటు రోగి నాడిని పట్టుకొనే ఎల్ ఎమ్ పి డాక్టరులాగా చూసారు. రోగము తా పరీక్షచేసి పెద్దాసిప్పత్రికి తీసుకెళ్ళండి అంటాడా డాక్టరు. "అలాగా ఆపీసికి ఎళ్లి రిపోర్టు సెయ్యండి బాబయ్యా. అళ్ళు పంపిస్తే వస్తాం" అన్నారు వాళ్లిద్దరూ ముక్త కంఠంతో. అప్పటికే ఎనిమిదిన్నర అయిపోవస్తోంది. పది గంటలకి ఆదరాబాదరాగా ఆఫీసుకి పరిగెట్టాలి. దాంతో పాటు నేను ఉన్నది సబ్ లెట్ క్వార్టరులో. అసలు యజమాని వెళ్ళితే తప్ప నేను కంప్లయింట్ యిస్తే సరిపోదు. "మీరే చేసేసేయండి. టీకి డబ్బు లిస్తాను". అన్నాను "పది రూపాయిలు అవుతాద్ది బాబయ్యా" అన్నాడు స్కావెంజరు. ఓబరాయ్ హోటల్లో ఐదు రూపాయలు టీ అయిదేళ్ళక్రితం త్రాగాను. వీళ్ళు పది రూపాయిలంటు న్నారు. ఏంటయ్యా ఇందులో ఏమి టుంది ? సరిగ్గా చెప్పండి అన్నాను. చాలా కష్టమయిన పనండి బాబయ్యా తవ్వాలి, పొడవాలి, కంపు, దుర్గంధం రకరకాల పదాలు వాడాడు వాడు. బహుశా వాడుకూడ మా ఆవిడ చదువుతున్న సాహిత్యం గాని చదువు తున్నాడా అన్న సందేహం ఏర్ప డింది". ఇదంతా వింటున్న ఇనబింభ విదన ఆ పదీ పారెయ్యండి ఎప్పుడూ ఆలోచనలే మీకు అంద్రి, మళ్ళీ తటు పటాయిస్తే ఆ పాకీదంపతుల ముందు నా పరువు పోతుందని "సరే కానివ్వండి" అని ఆర్డరిచ్చాను.

వాళ్ళిద్దరూ వెళ్ళి ఇనప చువ్వలు, పారలాంటివి తెచ్చి పని ఆరంభిం చారు. నేను, బాబిగాడు, వాళ్ళమ్మ

పడక గదిలో ఊపిరి బిగబట్టి కూచున్నాం. వాళ్ళు చాలా పనిచేస్తున్నట్లు గట్టిగా చప్పుళ్ళు, క్వార్టరు చుట్టూ తిరిగి ఏమేమో చేయడం మొదలెట్టారు అరగంట గడిచింది రెండు అయిదులు అంకించుకొని వాళ్లు ఉడాయించారు. "అమ్మయ్య" గండం గడిచిందని మేమిద్దరం నిట్టూర్పులు విడిచాం.

నాకు ట్రాన్స్ఫరయింది. నేను వెళ్తూ నాజాగాలో వచ్చిన జెన్నాబాబుకి ఆ క్వార్టరు ఏర్పాటు చేసి వెళ్ళాను జెన్నాబాబుది ఆ ఊరే.

కొన్ని రోజుల తర్వాత రాజధానిలో పనిపడి వెళ్ళాను. జెన్నాబాబు బలవంతం చేసి ఇంటికి తీసుకు వెళ్ళాడు. భోజనాలు అయిన తర్వాత ఆ రోజుకి అక్కడే పడుకొన్నాను మర్నాడు లేచిన వెంటనే లావెట్రీకి వెళ్ళాను. మళ్ళా జామ్ అయినట్టుంది నీరు ఎర్రగా, ఎర్రెర్రగా నేలకు ఇంచీ ఎత్తున పేరుకొని ఉంది. గబ గబా డోర్ వేసుకొని బయుద్దేరబోతున్న నన్ను చూసి జెన్నాబాబు లేచాడు. "ఎక్కడికోయ్ మిత్రమా!" అన్నాడు స్కావెంజరుని పిలుచుకు రావాలి. లావెట్రీ పేన్ జామ్ అయిపోయింది. అన్నాను. "నాన్సెన్స్. ఆపాటిదానికి స్కావెంజరు గట్రా ఎందుకు ?" గభాలన లేచి వంటింట్లోకి వెళ్ళాడు జెన్నాబాబు. పాత్రలు పట్టుకొనే చిమటా దొరకబుచ్చుకొని లావెట్రీలోకి వెళ్ళాడు. ఫ్లష్ అవుట్లో చిమ్టా పెట్టి గుండని బంతిలాంటి దానిని తీసాడు ఎర్రగా టెన్నిస్ బాల్ అంత ఉందది అది ఆ చుట్టుపక్కలా ఉండే చెట్లకు కాసే కాయది. నీటిలో నానిన రెండు రోజులకి అది ఉబ్బెత్తుగా పొంగి లావవుతుంది. కావాలనే పాకీవాళ్ళు లెట్రిన్ శుభ్రం చేయడానికి వచ్చినపుడు జారవిడుస్తారు. నేను యీ ఊరివాడిని. నా దగ్గర ఆ పప్పులేపీ ఉడకవు జెన్నాబాబు చెప్తున్న మాటలు విని నిర్ఘాంత పోవడం నావంతయింది.

## దగాపడిన తమ్ముడు

● గౌరునాయుడు (చినమేరంగి)

వాడొక అగ్గిపుల్ల
రగిలితే ....
కాల్చక మానడు
వాడొక సివంగి పిల్ల
రేగితే ....
చీల్చకా ఆగడు

## తస్మాత్ జాగ్రత్త !

● గౌరిజెన్నా (రాయగడ)

సహనం చచ్చినపుడు
శాంతికి కాలం తీరినపుడు
అవినీతి బరితెగించినపుడు
నీరు కూడా నిప్పై కాల్తుంది
మనసు కూడా
మంటై ప్రజ్వలిస్తుంది !

# మరణభాషిణి

● విజయచంద్ర

ఇక్కడేముంది ?
ఇక్కడ చావుబతుకుల్లో పెనుగులాడుతున్న నిశ్శబ్దముంది
ఇక్కడ నేల నాలుగు చెరుగులా కొండచిలువలా నోరునెర్చుకున్న చీకటుంది
ఇక్కడ వెయ్యి నాలుకలతో పొగలా వ్యాపించిన మృత్యువుంది
ఇక్కడ అసంపూర్ణ వాక్యంలా ఆగిపోయిన జీవితం ఉంది
ఇక్కడ అశ్వమేధకం ఉంది
నా ఉనికి ఎక్కడ అని ప్రశ్నించే మానవత శిలువమీద
ఆఖరి ఘడియల్లో ఉంది

ఇక్కడ మాటలు మరణిస్తున్నాయి
అభివాదాలు, కన్నీళ్ళు మొహంలోనే ఇంకిపోతున్నాయి
ఇక్కడ చుట్టూ ఎడారి కాపలా
సూర్యుడు రాడు చంద్రుడు రాడు నక్షత్రాలు రావు
గాలిరాదు వెలుతురు రాదు ఋతువులు రావు
అందరూ విదేశీయులే ఎవరూ రాకూడదు

♦ ♦ ♦

ఈ దినం నుంచి మరి నీకు నేను కన్పించను
నా వార్తను పేపర్లలో చదువు
నెల్లిలో హత్య చేయబడిన వందలాది శిశువుల్లో
నా చిత్రాన్ని కూడా పరికించు
వేలాది స్త్రీల రోదనల్లో
కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న వారి తడారని గొంతుకల్లో
నా ఉనికిని గుర్తించు

ఇక్కడ ఆకాశం వెయ్యి ముక్కలైంది
భూమి ఖండ ఖండాలుగా చీలిపోయింది

ఇక్కడ రోజూ రక్తపు వానే కురుస్తోంది
తల్లుల రక్తం
తండ్రుల రక్తం
పిల్లల రక్తం
ఏ ఊరువారో
ఏ వీధివారో
ఏ ఇంటివారో ఎవరు చూసారు ?
ఏ తండ్రుల బిడ్డలో
ఏ వంశం వారో ఎవరి సంతతో
ఎవరు గమనించారు ?
ఇక్కడ చరిత్రకు ఆకాశం సాక్ష్యం
ఇక్కడ కన్నీటికి భూమి సాక్ష్యం
ఇక్కడ విలయానికి ప్రకృతి సాక్ష్యం

*  *  *

ఏ దేశాల సరిహద్దులు దాటి వచ్చాయి ఈ కారుమేఘాలు ?
మృత్యువు తుఫానుగా
ఏందుకీ నేల మీద కరాళ నృత్యం లిఖిస్తోంది ?
ఎందుకీ హింస ఇక్కడ ప్రళయ పవనంలా దుమారం రేపుతోంది ?
ఏ సముద్రాలలోంచి ఏ నదులలోంచి
ఈ ఆవేదన ఆవిరై ఈ ఆకాశం గుండెలోకొచ్చింది ?
ఏ హిమాలయాల్ని ఈ దుఃఖం తాకింది ?

*  *

వాళ్ళెవరు ? అలా భయం తో పరిగెడ్తున్నారు ?
వాళ్లెవరు ? అలా భీతితో
తుఫానులో చెట్ల ఆకుల్లా ప్రకంపిస్తున్నారు ?
వాళ్ళనెత్తిమీద బ్రతుకు తాపత్రయం బుట్టలు
వాళ్ల భుజాలపై అంతులేని బాధల కావిళ్ళు
దుఃఖిస్తున్న వాళ్ల తలరాత ఎవడు రాసాడు ?
వాళ్ల జోలెల్లో పిడికిళ్ల కొద్ది దుఃఖాన్ని ఎవడు పోసాడు ?

ఎవడు వారినీ ఒంటరి ఎడారికి అప్పగించాడు ?
ఎవడు వారినీ మరుభూమిలో విడిచిపెట్టాడు ?
వాళ్ళేం దోచుకున్నారు ?
వాళ్లేం దాచుకున్నారు ?
చింకి బట్టలు, గుడ్డ మూటలు
తల్లులు, పిల్లలు, ముసలివాళ్ళు, విధవలు
కల్లా కపటం తెలియని వాళ్ళు, కబోదులు
రోడ్లు వేసేవాళ్ళు, అడవులు నరికేవాళ్ళు
చాయ్ బగన్‌లలో పనిచేసేవాళ్ళు
మన ఇంటి పక్కన నిశ్శబ్దంగా ఉండి ఉండనట్టు జీవించేవాళ్ళు
పండగల్లో మనల్ని కౌగలించుకొనేవాళ్ళు
మన ఆపదల్లో పరిగెత్తుకొచ్చేవాళ్ళు, కంటతడి పెట్టేవాళ్ళు
వీళ్లనెందుకు తరుముతాను ?
వీరి దగ్గరేముంది ? ఏం మిగిలింది ?
ఎందుకలా మీదపడి కుక్కల్లా తరుముతారు ?
ఎందుకలా మీదపడి సాయుధ గస్తీ సైనికుడిలా అరుస్తారు ?
అటు చూడండి ఆ నవ్వుతున్నవాళ్ళు
అటు చూడండి ఆ రాళ్ళు రువ్వుతున్నవాళ్ళు
అటు చూడండి ఆ బొజ్జలు పెంచినవాళ్ళు
అటు చూడండి జాతి పేరు మీద మతం పేరు మీద కులం పేరు మీద
లైసన్స్ ఉందా అని ప్రశ్నించేవాళ్ళు
అటు చూడండి మనుషుల మధ్య గోడలు లేపుతున్నవాళ్లు
అటు చూడండి పౌరాణిక స్వప్నం కంటున్నవాళ్ళు
పేదల నుంచి పేదలను విడదీసేవాళ్ళు
రాష్ట్రం నుంచి మరో రాష్ట్రం చీల్చేవాళ్లు
తల్లి నుంచి తల్లిని కోసేవాళ్ళు
తండ్రి నుంచి తండ్రిని నరికేవాళ్ళు
జాతి పతాకాన్ని చింపి ముక్కా ముక్కలు చేసి గాలికి ధూళికి ఎగరేసేవాళ్లు
విదేశీ గులామ్‌లకు విస్తరి వడ్డించేవాళ్ళు
నీ దుఃఖానికి నా దుఃఖానికి

వేలాది ప్రజల సజల నేత్రాలకు జవాబు చెప్పవల్సిన వాళ్ళు
కార్లలో తిరిగేవాళ్ళు కుక్కల్ని పెంచేవాళ్ళు మనుషుల్ని తరిమేవాళ్లు
పనులు పురమాయించే వాళ్లు
వారే మన కన్నీటిని కన్నీటితో గుణించారు
వారే మన బ్రతుకుల్లో నిప్పులు పోసారు
వారే మన జీవితాల్ని హాహాకారాలతో నింపారు
వారే మనం బ్రతికుండగానే మనకు చితి అంటిస్తున్నారు

* * *

మూలుగులు
హాహాకారాలు
గాయాలు
కత్తిపోట్లు
విస్ఫోటనాలు
విధ్వంసనాలు
అంతా రక్తం అంతా గాయం
ఇక్కడ నిన్ను చంపారు తుపాకీతో కాల్చారు
నీ తలను కొరివితో ముట్టించారు
ఇంకా ఇక్కడేం మిగిలింది ?
ఎవరు చెప్తారు ? ఎవరున్నారు గనుక ?
గాలి చెప్పదు వెలుతురు చెప్పదు చీకటి చెప్పదు
ఆవేదనలో ఆక్రందనలో ఆక్రోశంలో
ఎవరూ ఇక్కడ మాట్లాడరు
మంత్రిగారూ ! ఈ శూన్య ఎడారిలో హెలికాప్టర్‌లోంచి దిగి ప్రశ్నలు వేయకండి

ప్రశ్నలతో తూట్లు పొడవకండి
ప్రశ్నలతో పాత గాయాలు కెలుకకండి
మీ ప్రశ్నలకు మా అయనొస్తాడా ?
మీ ప్రశ్నలకు మా బాబొస్తాడా ?
మీ ప్రశ్నలకు మా నాయనొస్తాడా ?

మీ ప్రశ్నలకు మా అమ్మొస్తుందా ?
మీ ప్రశ్నలకు మా తమ్ముడొస్తాడా ?
ఎవరూ రారు బాబూ ఎవరూ రారు నాయనలారా
పొండి వెళ్ళిపోండి
మాకు ఎన్నికలొద్దు మాకు మీ కలలొద్దు
మాకు మీ కల్లిబొల్లి కబుర్లొద్దు
ఇక్కడ మేమెవరం ఉండం
ఇక్కడ మన దేశం లేదు ఇక్కడ మన ప్రజలు లేరు
ఇక్కడ మా ఇల్లులేదు ఇక్కడ మాకెవరూ లేరు
వెళ్లిపొండి బాబుల్లారా వెళ్లిపోండి
అంతా మట్టై పోయింది అంతా దిబ్బై పోయింది
బ్రహ్మపుత్ర లోయలో జీవితం మరణించిందని
అడిగినవారందరికీ చెప్పండి
మా చేతుల్లోంచి కాళ్లలోంచి ఏదో శక్తి లేచిపోయిందని
మా కళ్లలోంచి వెలుతురు మరో లోకానికి పయనమైందని
పార్లిమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులడిగితే సమాధానంగా చెప్పండి
వెళ్లిపోండి నాయనలారా ఇది మరుభూమి వెళ్లిపోండి

## అనాసక్తులు

● టియస్సార్

వాళ్లందరు
సముద్రం మీద నిద్రపోతారు
నిశ్చింతగా
తుఫానులు కూడా వీరి దరి జేరలేవు
నిప్పులు మీద నడిచి పోతారు
మహానుభావుల్లా
మంటలుకూడా వీరిని సమీపించలేవు

సంసారి ఆశ్రమంలో
ముక్తికొరకు
అన్నింటిని తిరస్కరిస్తారు
అధైర్యం వీరి ఉక్కు కవచం
ఆవేశం రెక్కలు లేని రాంచిలక
చెప్పేందుకు వీరి దగ్గర మరేమి లేదు
దాచేందుకు ఒక్క మాటా లేదు

ఇరుగు - పొరుగు :

# కత్తిప్రదానం

హిందీ మూలం : ● కుంవర్ నారాయణ్

తెలుగు అనువాదం : ● డా॥ చాగంటి తులసి

"సరిగ్గా కొనుగోలు చెయ్యడం మీకు రాదు. మీరు ఎప్పటికీ చెయ్యలేరు. కూరగాయలవనీయండి, విమానాలే అవనీయండి కొనుగోలు చెయ్యడం అన్నది నిజం చెప్పాలంటే సరుకు నాణెత పట్టడంలోనూ బేరం చెయ్యడంలోనూ ఉంటుంది. అదో కళ ! ఏళ్ల తరబడి తంటాలు పడగా పట్టుబడుతుంది. దానికెంతో ఓపిక కావాలి. ఓరకమైన తెలివి ఉండాలి. అది మీ దగ్గర సున్నా !"

చిన్న సాయెబును అన్నివిధాలా తక్కువ చేస్తూ చిన్నవాడిగా చేస్తూ అతనికి ఏం రాదని పెద్ద సాయెబు ఋజువు చేస్తున్నారు. కాస్సేపు ఊరుకుని ఏ రకంగా చూసినా తానెంత గట్టివాడో గొప్పవాడో అన్నది కూడా ఆయన చెప్పేరు. "ఇదిగో నన్నే చూడండి ! నేనెలా కొనుగోలు చేస్తున్నానో ? ఈ కూర గాయల గంప చూసేరా ? పైకి చూడ్డానికి అతి మామ్మూలుగానే కన పడుతుంది. ఇదులో ఏముంది అని పిస్తుంది. రెండు పదులు పెట్టి ఏ నౌఖరు కుర్రాడైనా ఈ మాత్రం కొనుగోలు చెయ్యగలడు అనిపిస్తుంది అయితే మహానుభావా ! ఈ కొను గోలు వెనక ఓ విశేషం ఉంది అది రెండు పదులు పెట్టినంత మాత్రాన దొరకదు. బతుకు బతుకంతా తంటాలుపడితే చేతులు నులుపుకుంటే దొరుకుతుంది."

చిన్న సాయెబు చూపులు అనుకో కుండా తన చేతుల వేపుకి మళ్లేయి. చాలా చిన్న చేతులు. విపరీతమైన రొంపా పడిశం పట్టింది. ముక్కు తెగ నీళ్ళు కారుతోంది. కారే ముక్కుని ఎగ బీలుస్తూ చేతులు నులుపుకుంటూ ఏదో అనబోయేరు. అయితే అంతలోనే పెద్ద సాయెబు మళ్ళీ కసిరేరు.

"మీతో నాకు తర్కం ఏమిటి ? వింటే నా మాట వినండి. లేకపోతే వెళ్ళి గోతిలో పడండి !"

పెద్ద సాయెబు మాట విండమో లేకపోతే గోతిలో పడ్డమో రెండింట్లో ఏదో ఒకటి తప్ప చిన్న సాయెబుకి మరో గత్యంతరం లేదు. చిన్న

సాయెబుని ఇలా ఇరుకులో పెట్టేసి వీడు గోతిలో పడాల్సిన వాడేనని ఇంచుమించు అంచనా కట్టేసేరు పెద్ద సాయెబు !.

"ముక్కోందుకలా ఎగ బీలుస్తున్నారు ? అంతా రొంపెలా పట్టింది? ఎప్పుడు చూడండి ఏదో ఓ రోగం ! పొద్దున్న లేస్తునే నాలా శీర్షాసనం వెయ్యరూ ! అందుకే ఈ రోగాలు ! నన్ను చూడండి ! ఐదు నిమిషాల పాటు తలకిందికి పెట్టి నిల్చుంటాను. అన్ని రోగాలూ ఉష్ మంత్రకాళీ అని దూరంగా పారిపోతాయి ! మీరూ ఉన్నారు ! ఐదు నిమిషాల పాటు కాళ్ళమీద నిల్చోడమే మీకష్టం ! ఎప్పుడు చూడండి, నడుం వాలుస్తూనే ఉంటారు !''

చాలా పదునుగా ఉన్న చాకు కొనని బొటకన వేలుతో రాసి చిన్న సాయెబు చూసేరు. తిరుగులేని సరుకు ! ఆయనకి గంపెడు కూరగాయల సంగతి జ్ఞాపకం వచ్చింది. మొత్తం కూరగాయలన్నిటినీ ఈ చాకుతో ఓ దెబ్బకి తరిగి పోగు పెట్టొచ్చు ! చాకు తీసుకున్నారు. బేరమాడి రెండున్నర పెట్టి కొన్నారు!

పట్టలేనంత ఆసక్తి ఉన్నా సాధ్యమైనంత వరకూ పైకి కనపడనివ్వలేదు పెద్ద సాయెబు ! అయితే నాణెత ఎగిరిన ఆయన దృష్టికి ఈ చాకు అరుదైనదిగా అనించింది.ఆయన చాకుని ముట్టుకుని చూడలేదు. దూరం నుంచే చూస్తూ ఉండిపోయేరు

పెద్ద సాయెబు అప్రసన్నంగా లేరన్న సంగతి చిన్న సాయెబు గుర్తించేరు. అయినా బెరుకు బెరుగ్గానే ఆయన చేతికి చాకుని యిచ్చేరు. పెద్ద సాయెబు అన్యమనస్కంగా ఉన్నట్టు చాకుని తిరగేసి బోర్లేసి చూసేరు. బ్లేడు పైకి లాగేరు. ఇంట్లో బేగం నోరు విప్పినట్టు తటాలుమని బ్లేడు తెరుచుకుంది ! పెద్ద సాయెబు చాకు పదును చూసి లోలోపల మెచ్చుకున్నారు. మా పదునుగా ఉంది ! దేన్ని పడితే దాన్ని కోసి పారెయ్యొచ్చు ! అయితే చిన్న సాయెబు పరిశ్నించే చూపు తన చూపుతో కలిసీకలవగానే అంత మెచ్చుకోలునీ లోలోపలే అణిచేసి దాచేసుకున్నారు. చిన్న సాయెబు చేతికి చాకుని యిచ్చేసి "ఫర్వాలేదు" అన్నారు ! పాపం చిన్న సాయెబు మనస్సు చిన్నబుచ్చుకుంది. అయినా మరోసారి అడిగి చూసేరు.

"మాంచి నాణెమైన సరుకు కాదూ ?"

"ఊఁ ఫర్వాలేదు. బాగానే ఉంది. మంచిది అని చెప్పడం దాని ధరని బట్టి ఉంటుంది. ఎంతిచ్చి తెచ్చేరు ! బాగానే పెట్టి ఉంటారు !"

"నాణెతని బట్టి చూస్తే నేపెట్టిన ధర అంత ఎక్కువ కాదండీ!"

"మరీ గొప్ప సరుకేం కాదు! ఇలాంటివి మార్కెట్టులో దొరుకుతూనే ఉంటాయి. ఎటొచ్చీ వెతికి పట్టుకునే తెలివితేటలుండాలి. లేపోతే మంచి సరుక్కి బదులు బోల్డంత డబ్బు రొంటిలోంచి జారిపోతుంది!" అన్నారు పెద్ద సాయెబు.

ఈ చాకు కొండంలో ఎక్కడ తప్పటడుగు పడి ఉంటుందో పెద్ద సాయెబు జాగ్రత్తగా కనిపెట్టేరు. తిరుగులేని ఎత్తు వేసి సంబరపడి పోతూ ఆయన మొహం తిప్పేసుకున్నారు. అయితే ఇవాళ చిన్న సాయెబు ఈ మాత్రం ఆ మాత్రం దానికి ఓడిపోవడానికి సిద్ధంగా లేరు! ఆ ఎత్తుకీ చిత్తయిపోకుండా

"మీరన్నది నిజమే. ఇలాంటి చాకులు బజార్లో దొరుకుతూనే ఉంటాయి. అయితే చాలా ప్రియం ఐదారు రూపాయిలకి తక్కువకి దొరకమన్నా దొరకవు" అన్నారు.

"అయిందా! మరేమిటనుకున్నారు!" అన్న భావం పెద్ద సాయెబు మొహం మీద జయం నాదేనన్నట్టు చిరునవ్వుగా మొలిచింది

"అయితే ఈ చాకుంది చూసారు? నేను చాలా తంటాలు పడి ఎంతో కష్టపడి కొన్నాను. దీని పదునూ దీని ధరా రెండూ గొప్పవే!"

ఇహ పెద్ద సాయెబు తన తహతహని సుళువుగా దాచుకోలేకపోయేరు. గుడ్డివాడి చేతి రాయిలా తగిలేసిందేమో! నిజంగానే వీడు ఈ చాకుని చవగ్గా కొనేసేడా అని లోలోపల అనుకున్నారు.

"ఎంతేమిటి?" అనుమానంగా అడిగేరు.

పెద్ద సాయెబు గొంతు వినగానే ఆయన ఆత్మవిశ్వాసం తగ్గినట్టుగా చిన్న సాయెబు కనిపెట్టేసేరు! తన ప్రతాపంతో ఎప్పుడూ శిష్యుడి నోరు మూయించే గురువుగారికి ఇంక ఈ శిష్యుడు ఆ శిష్యుడు కాడు. ఎప్పటిలాగా తేలిగ్గా బోర్ల బోర్లపడి నేల కరుచుకోడు అని హఠాత్తుగా అంతర్వాణి చెప్పినట్టు అనిపించింది!

చిన్న సాయెబు చాలా సంబరంగా చెప్పేరు.

"చాలా చవక"

దీంతో పెద్ద సాయెబు చాలా జాగ్రత్త పడుతున్నారని పైకే పూర్తిగా తెలిసిపోయింది! ఆయన చెయ్యి కిందదైందని!

ఆయన యింతగా జాగ్రత్త పడ్డం చిన్న సాయెబు ఎప్పుడూ చూడలేదు. అంటే తన ఎత్తు తిరుగులేనిదే అయింది! ఇవాళ నిజంగానే ఏదో

గొప్ప అద్భుతమైన ముగింపు జరిగే టట్టు ఉంది !

"అయినా ఎంతో ఏమిటో చెప్పండి" అన్నారాయన.

"మీరే చెప్పండి ఎంతుంటుందో? ఎంతిచ్చి కొంటే తిరుగులేని కొనుగోలుగా మీరు ఒప్పుకుంటారో ?"

పెద్ద సాయెబు దీన్ని ఛాలెంజిగా తీసుకున్నారు. ఈ చాకు ఖరీదెంతో తాను ఊహించలేనంత ధరకి వీడు తెచ్చేడా ? అసంభవం ! పెద్ద సాయెబు గారికి కొనుగోలు చెయ్యడంలోనూ అమ్మడంలోనూ ఈనాటిదా నిన్నటిదా అనుభవం ! ఎన్నో ఏళ్ల అనుభవంతో ఆయన పండిపోయేరు! నిన్నగాక మొన్న కళ్ళు తెరిచిన గుంటడు పది పైసల చాకు చవగ్గా కొన్నాడో లేదో ఇవాళ ఆయన్నే సవాలు చేస్తున్నాడు ! వీడికి పాఠం చెప్పాలి !

"ఓ రూపాయేనా ?" మహా నిర్మోహమాటంగా అడిగేరు !

చిన్న సాయెబు మొహం పాలిపోయింది. పెద్ద సాయెబు నమ్మకద్రోహానికి తలపెట్టేరని ఆయనికి తెలిసిపోయింది ! ఎత్తులు పై ఎత్తులతో బండి నడవటం లేదు. ఎలాగో ఓలాగ అన్యాయంగా అయినా సరే గెలవడం కావాలి. పేరు మోసిన గురువు ! గుంటడి ముందు బోర్లాపడి చిత్తయిపోతే ఇంకేముంది ! పెద్ద సాయెబు నడవడి తిన్నగా లేదని తెలిసిపోగానే చిన్న సాయెబుకి తనని తాను కాపాడుకోవడం తప్పనిసరి అయింది. "స్పోర్ట్స్" "స్పోర్ట్స్"వరకే ఆగలేదు. నువ్వా నేనా అన్న స్థితికి చేరుకుంది. పెద్ద సాయెబంత తొందరగానూ చిన్న సాయెబు చెప్పేరు.

"పన్నెండణాలు"

పెద్ద సాయెబు తొట్రుపడ్డారు !

"అబద్ధం! పచ్చబద్ధం!" కోపంతో అరిచారు.

"మీ వ్యాపారానుభవం మీద ఒట్టు వేసి చెప్తున్నా నిజమండీ నిజంగా నిజం అన్నారు చిన్న సాయెబు.

అయితే పెద్ద సాయెబంత మూర్ఖులేం కారు ! వెంటనే జేబులోంచి ఓ పది రూపాయల నోటు తీసేరు. చిన్న సాయెబు చేతిలో పెట్టేరు.

'ఇలాంటి చాకులు ఓ అరడజను నా కోసం కూడా తెచ్చిపెట్టండి' అన్నారు.

చిన్న సాయెబు జావ కారిపోయేరు. పెద్ద సాయెబు చిన్న సాయెబు జావ కారిపోవడాన్ని మహదానందంగా కనిపెడుతున్నారు. ఇంకా గుంటడు ! ఎవరితో ఢీ కొంటున్నాడో తెలీటం లేదు ! ఆయన మొహంలో వ్యంగ్యంతో కూడిన ఆనందం వెల్లివిరిసింది. ఆ ఆనందాన్ని

నిన్న సాయెబు భరించలేకపోయేడు. ఇవాళ ఆయనా ఓ రకమైన ఆవేశంతో ఉన్నారు. మరోరోజైతే పెద్ద సాయెబు గారి వ్యంగ్యాన్ని వెక్కిరింతని ఖాతరు చెయ్యకుండా వెళ్ళిపోయి ఉండేవారు కాని ఇంత పెద్ద సాయెబు అన్యాయపెత్తులు వెయ్యడం మొదలెట్టేరు ఇవాళ ఓడిపోవడం అంటే అన్యాయానికి ఓడిపోవడం అన్న మాట ! ఇవాళేమైనా సరే గెలవాలి. గెలిచి తీరాలి. పెద్ద సాయెబు అన్యాయంతోనూ చెడ్డతనంతోనే కాదు. బుద్ధి పెద్దవాణ్ణని గొప్పవాణ్ణని ఋజువు చెయ్యాలని చూస్తున్నారు ! చెడ్డతనంతో మంచి తనాన్ని ఎవడైనా గెలిస్తే గెలవొచ్చునేమో కాని తక్షణమైన బుద్ధిబలంతో కూడా గెలిస్తే ఎలాగ ? దాన్ని సహించడం కూడదు !

"భలేవారండీ ! ఇప్పుడింక ఇలాంటి చాకు ఈ ధరకి ఎక్కడ దొరుకుతుంది ? ఈ ధరకి మార్కెట్టు మొత్తానికీ ఒకటే ఒకటుంది. అదైనా నేను ఎ.తో కష్టపడి తంటాలు పడి తంటాలుపడి పట్టుకున్నాను. మిగిలిన చాకులంటారా, దీనికంటే నాసివికానివైనా ఉన్నాయి. దీనికన్నా ఎక్కువ ధరవైనా ఉన్నాయి. అయినా మీకేం కష్టం ! మీరా అనుభవజ్ఞులు ! ఎక్కడో ఓ చోట ఇలాంటి సరుకుని ఇంతకన్నా చవగా పట్టుకోగలరు. చిన్న సాయిబు పది రూపాయల నోటు తీప్పి యిచ్చేస్తూ అన్నాడు.

పెద్ద సాయెబు చిన్న సాయెబు వేపు నోట మాట లేకుండా చూస్తూ ఉండిపోయేరు. రెండు నిమిషాలయేక చిన్న సాయెబుకి దగ్గరగా వెళ్ళి వీపు తట్టేరు.

"శభాష్ ! ఇప్పుడిహ మీరు అసలు సిసలు వ్యాపారస్తులయేరు. ఇవాళ మీరు చూపిన చమత్కారం ఉండే అదేవ్యాపారానికి అసలుకిటుకు. ఎక్కడా ఎప్పుడూ మోసపోని వ్యాపారస్తుడు ఎవడూ ఉండడు. అయితే మోసపోయి కూడా మరో వార్ని మోసం చెయ్యడం నేర్చుకోకపోతే వాడు ఎప్పటికీ వ్యాపారం చెయ్యలేడు. ఈ వ్యాపారం లోకవ్యవహారం ! ఇది ఇంటిదగ్గర్నుంచే మొదలవుతుంది ! ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకోండి చిన్న పిల్లలున్నారే - వాళ్ళు ప్రేమించనన్నా ప్రేమిస్తారు. లేవా అసహ్యించుకున్నా అసహ్యించుకుంటారు. అయితే వాళ్ళే పెద్దయ్యేక కేవలం వ్యాపారం చేస్తారు ! ప్రేమతోటి న్యాయం తోటి బైటి వాళ్లను గెలవగలనన్న భ్రమలో ఎప్పుడూ పడకండి గెలవడమే అవసర . ఎలా అయినా సరే ! ప్రతి మనిషి ఎలాగో ఓలాగ గెలవాలన్న ప్రయత్నంలోనే ఉంటాడు. అయితే ప్రేమతోనూ న్యాయంతోనూ ఎంతమాత్రం కాదు.

# తల్లి తన ఆలోచనలు కొడుక్కి పంపింది

రష్యన్ కవిత : మక్సీం టాంక్ అనువాదం : ● రామతీర్థ

తెలతెలవారుతుంటే
తల్లి కొడుక్కి తన ఆలోచనల్ని పంపింది
ఆ ఆలోచనలే పెనుగాలులై తుఫానిస్తూ
అవామెకు తిరిగొచ్చాయి
పరిగాఢమైన దుఃఖంతో
తల్లి కొడుక్కి తన కన్నీళ్ళని పంపింది
కారుమేఘాలై తిరిగొచ్చాయా కన్నీళ్ళు
అతిత్వరలో
జవాబు కోసం ఎదురుచూస్తూ
తల్లి ఓ పాటని పంపింది
నల్లగా, వక్రించిన విధిలా
కాకై తిరిగొచ్చిందా పాట
కటువుగా హెచ్చరించిందామెని
నూతిగట్టుమీంచా నల్లకాకి వికృతంగా అరుస్తూ !
"నిష్ప్రయోజనంగా ఎదురు చూడకు !
నీ కొడుకు తిరిగిరాడిక్కడికి !"
"అతనానందంగానే వచ్చుండేవాడు నీ దగ్గరకి
కానీ తను జంకుతున్నాడు
కంఠంలో బెరీల మాలలతో
బట్టబయలైన మైదానంలో తను వాలిపోయున్నాడు"
"రోవాన్ వేళ్ళతని చుట్టూరా చుట్టుకున్నాయి
మరి దాని కొమ్మలో !
ఎర్రగా వెలుగుల్ని చిమ్ముతున్న పుష్పాలతో
దయతో అతన్ని కప్పివేస్తున్నాయి"
కొండ పక్కగా వీరుణ్ని కప్పేస్తూ
ఇంకా రోవాన్ చెట్టు
గలగలా శబ్దం చేస్తూనే ఉందతని భుజాల పక్కగా
సాహసికైన [illegible] ! [illegible] !!

# వుచ్చు

● రేగిడి నాగభూషణరావు

కంచర పాలేం లెవెల్ క్రాసింగ్ దగ్గర నేను ప్రయాణం చేస్తూన్న వేన్ ఆగిపోయింది. గేటు వేసిలేదు. లెవెల్ క్రాసింగ్ దగ్గర గోదావరి ఎక్స్‌ప్రెస్ క్రింద పడి ఎవడో చచ్చి పోయాడు. శవం చుట్టూ జనం మూగి వున్నారు.

"ఎవరో పాపం ! నిరుద్యోగట. ఎమ్మే పాసయి ఏడు సంవత్సరాలైనా వుద్యోగం దొరక లేదట. అటు యింటికి పోలేక, ఇటు పొట్ట నింపుకోలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడట. ఎన్నాళ్ళ గానో తిండిలేక ఈ చావు కోరు కున్నాడట" ఇంక, ఇన్వెస్టిగేటు చేయడానికి పోలీసుల కేమీ మిగల్చ కుండా, ఆ చావు వివరాలు జనం చెప్పుకుంటున్నారు.

"నిరుద్యోగట" అన్నమాట వినే సరికి బలరాం గుర్తుకొచ్చాడు. నేను బలరాం ఒకే బడిలో ప్రారంభించి ఎం. కాం. వరకు ఒకే బెంచిమీద కూర్చొని చదువుకున్నాం. బలరాం చాలాచురుకైనవాడు, తెలివైనవాడు. ఎం. కాం. లో ఎక్కువ మార్కుల తోనే పాసయ్యాడు. ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు. వాడు అప్లికేషన్ పంపించటమే ఆలస్యం వుద్యోగం కాళ్ళదగ్గర కొస్తుంది అని అను కనేవాడిని. నా అత్తెసరు మార్కులు చూసుకొని ఈ జన్మలో నాకు వుద్యోగం అంటూ వస్తుందని ఆశించ లేదు. విచిత్రం ఎంటంటే, వాడికింత వరకు వుద్యోగం దొరకలేదు. నేను అప్పుడే ఆరు సంవత్సరాల ఉద్యోగాను భవం సంపాదించాను. ఈ ఆరు సం వత్సరాలుగా బలరాం చేయని ప్రయత్నమంటూ లేదు.

గతసారి హైద్రాబాద్‌లో ఏదో ప్రయివేట్ కంపెనీలో వుద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లి తిరిగివస్తూ నన్ను కలిశాడు. ఇంటర్వ్యూ వివరాల కంటే, ఇంటర్వ్యూ ఫలితంపై, తన భవిష్యత్ ఎలా మారనుందో చెప్పు కొచ్చాడు. ఈసారి కూడా తనకు వుద్యోగం దొరకకపోతే, ఆంధ్రా యూనివర్శిటీ యిచ్చిన సర్టిఫికేట్‌ను యూనివర్శిటీ "ఇన్" గేటుకు ఎదు రుగా తగలబెట్టి, బంగాళాఖాతంలో పడి జీవితాన్నిక సరిపెట్టేస్తానని చెప్పేడు. ధైరం చెప్పాను. తను వినే స్థితిలో లేడు. జీవితంపై విరక్తి

తనలో జీర్ణించుకుంది. మనిషి ఆశా జీవిగా బ్రతకాలని చెప్తే, ఆ ఆశతోనే ఇన్నాళ్లూ గడిపానని చెప్పాడు. తన ప్రతీ మాటలోనూ, నిరాశా, నిస్పృహలు స్పష్టంగా కనిపించాయ్. తన మానసిక వేదన వూహిస్తేనే భయం వేస్తుంది. అనుభవించే తను ఎంతలా బాధపడుతున్నాడో ! బలరాం గుర్తు వచ్చినప్పుడల్లా నా గుండె చెరువై పోతుంది. తన వుద్యోగం కోసం ఏదైనా చేయాలని ఆవేశం వస్తుంది. కాని.... తనకేమీ సాయం చేయలేక పోతున్నాను, సానుభూతి తప్పించి నా పరిస్థితి నన్ను ఎటూ అవకాశమివ్వటం లేదు. నేను చేసే వుద్యోగం కూడా గతి గోత్రం లేని ఎల్డీసి.

నేను దిగవలసిన స్టాప్ రావటంతో నా ఆలోచనలు అంతటితో ఆగాయ్. స్టాపులో దిగి యింటికేసి నడిచేను. దగ్గరగా చేరవేసిన తలుపు తీసుకుంటూ ఇంట్లో అడుగు పెట్టానో లేదో "మీకో శుభవార్త" అంది బొమ్మలా నిలబడి శ్రీమతి. తన చేతిలో ఏదో కవరుంది.

"బలరాంకు వుద్యోగం వచ్చిందా?"

"అంతకంటే సర్‌ప్రయిజింగ్ న్యూస్. మీ ఫ్రెండు బలరాంకు పెళ్లి" అని చెప్పి శుభలేఖ నా చేతిలో పెట్టి కాఫీ తెచ్చేందుకు లోపలకు వెళ్లింది శాంతి.

బలరాంకు పెళ్ళా ! నమ్మలేక పోయాను. అది శుభలేఖే. వరుడు బలరాం. వధువు కళ్యాణి. చదివాను. రెండు మూడుసార్లు చదివాను. ఫ్రమ్ ఎడ్రసు చదివాను. అది బలరాం పెళ్ళి శుభలేఖే. అయినా, నమ్మకం కలగ లేదు.

ఈ ఆరు సంవత్సరాల నిరుద్యోగంలో ఎప్పుడూ తను పెళ్ళి మాట ఎత్తలేదు. ఎవరైనా ఆ విషయం ఎత్తితే "నీకేం పిచ్చా ! వెర్రా !! వుద్యోగం లేనివి పెళ్ళి చేసుకోడానికి మా తాతల ఆస్తులున్నాయా "? కూచోని తినడానికి నిధులేమన్నా వున్నాయా ? బ్రతకటానికి వుద్యోగం వుందా ? అంటూ ఎదురు ప్రశ్నించే వాడు. వుద్యోగం రాకుండా ఎట్టి పరిస్థితిలో కూడా బలరాం పెళ్ళి చేసుకోడు. తన ఆదర్శాన్ని వదులుకునే రకంకాదు. అందుకే శుభలేఖ ఎలా వచ్చిందా అని ఆలోచిస్తున్నా.

"చాల్లేండి ఆలోచనలు. కాఫీ చల్లారిపోతుంది". శాంతి గుర్తుచేసింది కాఫీ తాగుతూ వున్నా, బలరాం పెళ్లి - వుద్యోగం గూర్చే తలాతోకా లేని ఆలోచనలు.

మర్నాడు బలరాం నుండి వుత్తరం వచ్చింది, పెళ్ళికి, తప్పకుండా రమ్మంటూ. ఇంకో వారం రోజుల్లో

హైదరాబాద్‌లో పెళ్ళి. ఇతర వివరా లేమీ లేవు.

"నిన్నటి వరకూ వుద్యోగం లేదురా అం[illegible] ఒకటే ఏడుపూ - గోలా! ఇప్పుడు పెళ్ళి పట్టు ఎక్కు తున్నాడు [illegible]" అం[illegible] సణిగాను నా ధోరణి విన్న శాంతి "బాగుంది. మీరూ-మీ కోపమూ [illegible]. అతనే శుభమా అని పెళ్ళి చేసుకోబోతుంటే మీరేంటి ఇక్కడ చిందులు? పెళ్ళి పైవారం కోణార్క్‌లో రిజర్వేషన్ చేయించండి. నేను [illegible]" అంది.

* * *

"హలో! గాం[illegible]!" అం[illegible] ఉత్సాహంగా పలకరించాడు [illegible]లరాం శాంతికి నవ్వులు [illegible] నమస్కారం చేశాడు. నిన్నటి వరకు బాగా [illegible] పెట్టి వెతికినా నవ్వు [illegible] కని పించని బలరాం ముఖం [illegible] మెరిసి పోతూంది. [illegible]పంచంలోని ఆనందమంతా వాడొక్కడి [illegible] ఖుషీగా వున్నాడు.

"ఏరా! నీకు వుద్యోగం వచ్చిందా?" అడిగాను.

'ప్రూహూ....' గంగి [illegible] తల అడ్డంగా తిప్పాడు. ఒళ్ళు మండి పోయింది

'మరి యీ పెళ్ళి?'

".... ...." తలదించుకున్నాడు.

"వుద్యోగం దొరకనిదే పెళ్ళి చేసు కోనని చెప్పావనుకుంటాను!"

"అవును"

"ఏంటింది? అవును?"

"పిచ్చి కుదిరితే గాని పెళ్ళి జరగదు. పెళ్ళి జరిగితే పిచ్చి కుదరదు. అలాగే పెళ్ళి జరగనిదే వుద్యోగం దొరకదు."

"నిజంగా నీకు పిచ్చి పట్టిందిరా"

"పిచ్చి కాదురా! నాకు వుద్యో గం రావాలంటే యీ పెళ్ళి చేసు కోక తప్పదు" గంభీరంగా చెప్పాడు బలరాం

"[illegible] చేసుకుంటే వుద్యోగం వస్తుందా!"

"[illegible]!"

"[illegible] అనాకాపల్లి [illegible] ప్లాన్. [illegible] ఉంది."

"[illegible] చేసుకుంటే వుద్యోగం [illegible] ఏర్పాటు చేస్తానని [illegible] గారు మా [illegible] మాట [illegible]."

"అంటే, నీకు ఇవ్వాల్సిన [illegible] కట్నాన్ని [illegible] వుద్యోగాన్ని కొంటు న్నారా?"

"కట్నం అతను ఇచ్చుకోలేరు. [illegible] పదవి - పలుకు బడులు న్నాయా?"

"గత ఇరవై మూడేళ్ళుగా యల్టీసీ గా పన్చేసి ఈ మధ్యనే యూడీసీ అయ్యారు.''

"అయితే నీవు నిజంగా పప్పులో కాలు వేశావ్. అటు ఎలాగూ వుద్యోగం రాదు. ఇటు మెడకో గుదిబండ. బాగానే వుందీ వరస !"

"అటువంటి భయవేం లేదు."

"నీ మొహంలా వుంది. కనిపించనీ కనుక్కుంటూ నీ మామగారి సంగతి''

* * *

"నేను బలరాంకి మిత్రుణ్ణి. ఆతనికి ఏ మాత్రం అన్యాయం జరిగినా నేను సహించలేను. యూడీసీగా వుంటూ మీరెలా వుద్యోగం ఇప్పించగలరో చెప్పండి.'' రాఘవరావు గారిని నిలదీసి అడిగాను.

"చూడబ్బాయ్ ! బలరాం శ్రేయస్సును నీవెంతలా కోరుకుంటున్నావో కళ్యాణి శ్రేయస్సును నేను అంతలా కోరుకుంటున్నా. నేను మాత్రం కాతురుని ఒక నిరుద్యోగి కిచ్చి ఎలా పెళ్ళి చేస్తాను ? బలరాం రేపే వుద్యోగంలో చేరాలి !''

"మరి ఆర్డరు ?''

"నాదగ్గర వుంది ''

"మీ దగ్గరా? అదెలా సాధ్యం?"

బలరాం ఇంటర్వ్యూలో సెలెక్టు అయ్యాడు. ఆర్డరు తయారైంది. ఆ ఆర్డరును నేను పంపించాలి. ఆర్డరును పంపించలేకపోవటం ఎటూ సాధ్యం కాదు ఈ విషయాన్ని మధ్యపెట్టి ఒక నాటక మాడేందుకు సాహసించాను. మా అమ్మాయిని వివాహం చేసుకుంటే. వుద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపాను. నాకు అల్లుడు కావాలి బలరాంకు వుద్యోగం కావాలి. నా షరతుకు వప్పుకున్నాడు. కాకతాళీయంగా నేను చేసిన ప్రయత్నం సఫలమౌతోంది బలరాం ఈ సంబంధానికి వప్పుకున్నా, వప్పుకోక పోయినా, తనకి వుద్యోగం వచ్చి వుండేది. కాని నేను ఈ నాటకమిలా ఆడివుండక పోతే, కళ్యాణికి పెళ్ళి జరిగి వుండేది కాదు."

## కలలబడి

● లలిత

తలపుల కౌగిటిలో నలిగి
కనురెప్పల నీడలలో కదిలి
కనుపాప అద్దంలో నిలచిన నాకు
చెంత వుంటే చాలు నిశ్చింత !

## ఆ ప్రమాదానికి నా ఆహ్వానం

● జ్యోత్స్న

గాలి ఎండిపోయి
ఎండలు మండితే ప్రమాదమట :
మరి నెత్తురు యింకిపోయి
గుండెలు మండితే ! ?

లేఖలు :

# తులసీదళం ఇస్తున్న సందేశం ఏమిటి ?

సంపాదకులకు,

"తులసీ దళం" నవల గురించి మీ అభిప్రాయం ఏమిటో వ్రాయమన్నారు. దాని మీద తెలుగు దేశం నిర్ద్వంద్వంగానే తన అభిప్రాయం చెప్పింది. క్షుద్ర సాహిత్యం అని వేలాది ప్రతులు చెల్లిపోవచ్చుగాక. కొమ్మూరి వంటి రచయితలు అయిష్టంగానే మెచ్చుకొని ఉండవచ్చు. గాని అది క్షుద్ర సాహిత్యంగానే తెలుగు దేశం తన తీర్పు నిచ్చింది.

నవలగా అది పరిగణనకు రాదు. పాత్రలకు ఒకదారి తెన్ను లేదు. వారి కార్య కలాపాలకు రచయిత అవసరం పట్టి తప్ప కార్యకారణ సంబంధం వుండదు.

శ్రీధర్ యింట్లో సరస్వతి బంధువునంటూ మకాం వేస్తాడు. ఏరకమైన బంధువు అని శ్రీధర్ కానీ, భార్య కానీ తెలుసుకోరు. వాడేగాక తన కొడుకంటూ పైడి తల్లిని తెచ్చి తెచ్చిపెడతాడు. అయినా సరే తన దయ్యాల కథకు వాళ్ళు శ్రీధర్ ఇంట్లో చేరడం అవసరం గనక రచయిత ఆ ప్రశ్నే రానీయడు చివరవరకూ.

అలాగే తులసి జబ్బుపడి చాలా బలహీనంగా వున్న స్థితిలో భూత వైద్యుడు వచ్చి ముంత పొగ వేస్తాడు. ఆ పాప చాలా హింసకు గురి అవుతుంది. అంత జరుగుతున్నా తల్లిదండ్రుల పొడ కనబడదు. వాళ్ళేం చేస్తున్నారు ?

తులసి మెడలో తాయెత్తు కట్టించేడు శ్రీనివాసపిళ్ళే. ఆ తాయెత్తుతో ఆమె 20 రోజులు పైగా వుంది. ఆ మధ్య కాలంలో పిల్లదాని బట్టలన్నా మార్చలేదా, స్నానం చేయించలేదా ? తమరు కట్టివుండని తాయెత్తు ఎందుకు వచ్చిందనే ఆలోచనేనా ఎందుకు రాలేదు ?

ఇలాగే చాలా చోట్ల రచయిత తన ఆలోచనలను నిరూపిస్తున్నాననుకుంటూ అర్థం పర్థం లేని తరహాలో నవలను నడుపుతాడు అందుకే దానిని ఓ నవలగా పరిగణించరాదనడం.

అయితే దానిని రాయడంలో ఆయనను ప్రేరేపించిన భావాలేమిటి ?

దయ్యాలూ, భూతాలూ, ప్రేతాత్మలు గురించిన కథలు అబద్ధాలని ప్రజల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని స్వార్థానికి వుపయోగించుకునేందుకు మోసగాళ్లు చేసే ట్రిక్కులు, గారడీలుతో కల్పిస్తున్నవే తప్ప వేరుకావని తెలుగునాట రమారమీ నూరేళ్ళ క్రితమే కందుకూరి వీరేశలింగం గారు వానిని ఎదుర్కొన్నారు. వానిమీద ప్రత్యక్షగానూ, సాహిత్యం ద్వారానూ కూడ తీవ్రమైన దాడి జరిపారు. ఒక విధంగా గ్రామాలలోని అమాయక ప్రజాసామాన్యం యొక్క మెదడులు కూడ ఆ వాదనలను అందుకున్నాయి. క్రమంగా విస్తరిస్తున్న విద్యాభివృద్ధి, ఉవ్వెత్తుగా విజృంభించిన రాజకీయ చైతన్యము, అభ్యుదయోద్యమాలూ ఆ ఆలోచనలను దృఢపరిచాయి.

పురోగమనాన్ని అంటిపెట్టుకునే తిరోగమన ప్రయత్నాలూ ఉంటాయి. అభ్యుదయ ప్రజోద్యమాల విజృంభణ తాత్కాలికంగా వెనకబట్టిన ఒక చారిత్రిక దశలో (1950 తర్వాత) దేవుళ్ళ మీద భక్తి ప్రపత్తుల్ని పునరుజ్జీవింప చేయడానికై ఎటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయో మనం అందరం చూస్తున్నాం. తిరోగమన వాదులకు అదొక్కటే చాలదు. దేశంలో సర్వతో ముఖంగా వ్యాపిస్తున్న శాస్త్ర విజ్ఞానాభిరుచినీ, దానిమీద విశ్వాసాన్ని కూడ చెదరగొట్టటం అవసరం. ఆ విషయంలో "తులసిదళం" పాత్ర చాలా ముఖ్యమైనది.

కొమ్మూరివారు తమ పీఠికలో రచయిత ఆత్మవిశ్వాసం కోల్పోయి కావచ్చు - "కథ కొంత వరకూ నడిచాక, కొంచం దారిని మార్చుకొని హిప్నాటిజం వైపూ, ఎలక్ట్రానిక్సు వైపూ వైద్యవిధానంలోని ఆధునిక ప్రక్రియల వైపూ పరుగెత్తాడు ! అంటారు" ప్రోగ్రెసివ్ అవుట్‌లుక్ వున్న రచయిత ఈ ఇతి వృత్తాన్ని ఎందుకు ఎన్నుకున్నాడా- అనిపించిందంటారు.

కానీ రచయిత ప్రోగ్రెసివ అవుట్‌లుక్ ఉన్నవాడు కాదు. ఆత్మవిశ్వాసం కోల్పోయి శాస్త్ర విజ్ఞానం వైపు పరుగెత్తనూ లేదు. అదో భ్రమ. దేవుడున్న చోట దెయ్యాలూ వుంటాయంటూ రచయిత రెండు మూడు చోట్ల అనడం కూడ పాఠకుల్ని తప్పు దారిపట్టించేందుకే. దయ్యాలు

భూతాల మీద తీవ్రంగా దాడి చేసిన కందుకూరి వారు ఆస్తికులే నని మరవవద్దు. ఈ రచయిత దాడి శాస్త్ర విజ్ఞాన పురోగతి మీద. శాస్త్ర విజ్ఞానం ఒక స్రోతస్విని. గమ్యం చేరుకుని నిలబడిపోలేదు. నిరంతరం పాత అవగాహనలో మార్పులు వస్తున్నాయి. కొత్త సంగతులు తెలుస్తున్నాయి. ఊహించని అభివృద్ధి వస్తూంది. అయితే ఒక్కటి మరచిపో కూడదు. అభివృద్ధికి రెండంచుల వాడివుంది. అది మనిషికి ఉపకారం చేయగలదు, అపకారమూ చేయగలదు. ఈ రచయిత సృష్టించిన పాత్రలు ఈ రెండో పంథా నెన్నుకోవడం యాదృచ్ఛికం కాదు.

నవల ముగింపు తీసుకోండి.

తులసి ఆరోగ్యం చక్కబడింది. ఏ విధంగా ?

1. కాద్రా పళ్ళు విరగ్గొట్టి కాస్మోరాకి అతను బలి కావడం వల్లనేనా ?

2 శ్రీనివాస పిళ్ళై కట్టించిన తాయెత్తును నాశనం చేసి తులసి మెదడుకి ఎలక్ట్రానిక్ సందేశాలు అందకుండా చేయడం వలనేనా ?

3. లేక డా॥ పార్థసారధి తులసి గుండెకు ఇచ్చిన మసాజ్ వలననా ?

ఈ మూడు కారణాలూ ఏకత్ర పరచడం వలన రచయిత భూతవైద్యాన్నీ, ఆధునిక విజ్ఞానాన్నీ సమన్వయం చేయదలచెడనే భ్రమ కలిగించేరు కొందరిలో. అది పొరబాటు. డా॥ పార్థసారధి తన డైరీలో రాసుకున్న వాక్యాలు చూడండి.

"....ట్రాష్. ఈ సైకాలజీ, ఈ మెడిసన్, ఈ సర్జరీ అంతా ట్రాష్ ...." (పుట 156) ఈ అభిప్రాయాన్ని నాలుగైదు చోట్ల భిన్న సందర్భాలలో చూస్తాం.

"క్షుద్ర విద్యలున్నాయా ?" అని ప్రశ్నించుకుని "ఏమో" అన్న అనుమానం వెలిబుచ్చుతూ - నమ్మక చేతులు కాల్చుకొనే వారున్నారు శ్రీధర్‌లా" (పుట 194) అంటారు రచయిత. పాఠకులకు ఆయన ఇచ్చిన సందేశం అది.

మనం క్షుద్ర విద్యలను నమ్మరాదు !

డామిట్ ! మనం విస్మరించిన నైతిక స్పృహను రంగనాయకమ్మ గారు కనబరిచేరు. ఆమెను అభినందించాలి.

**- మహీధర రామమోహనరావు**

పుస్తక సమీక్ష :

# శ్రీ ఉప్పల లక్ష్మణరావు గారి "గెరిల్లా"

● అవంతి

భారత ప్రజల స్వాతంత్ర్య పోరాట చరిత్రలో తెలంగాణా రైతాంగం సాగించిన విముక్తి పోరాటం ఒక ప్రధానమూ, ఉజ్వలమూనైన ఘట్టం. భాషా సంస్కృతుల పరిరక్షణ కోసం నిజాం పాలకుల మీద ఆర్య సమాజం, తరవాత సంస్థాన కాంగ్రెసుల నాయకత్వాల తలెత్తిన ప్రజా ప్రతిఘటన, సంగం (కమ్యూనిస్టు పార్టీ) నాయకత్వాన వెట్టి వ్యతిరేక ఉద్యమంగా విస్తరించి భూస్వామ్య వ్యతిరేక సాయుధ పోరాట రూపంతో ప్రజ్వరిల్లింది. ఈ పోరాటం అన్ని దశలలోనూ నిరంకుశ భూస్వామ్య, మతశక్తులు సాగించిన హింసాకాండా, దానిని అధిగమించి ప్రజానీకం చూపిన తెగువా, సాహసమూ అవిస్మరణీయాలు. ప్రత్యేకించి సంగం నాయకత్వాన అట్టడుగు పీడిత తాడిత ప్రజ ఉద్యమంలోకి వచ్చేక నిజాం ప్రభుత్వ బలాలు, అయన పెంచి పోషించిన రజాకారు మూకలే కాదు, దేశ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి కేంద్రంలో ప్రభుత్వాధికారాన్ని దఖలుపరుచుకున్న కాంగ్రెసు నాయకత్వపు నైతిక బలమూ, కాంగ్రెసు ప్రభుత్వపు సైన్యబలగాలూ కూడా ప్రజా వ్యతిరేకంగా సమీకృతమయాయి. అక్కడే మ వి ప్రారంభమయింది జాతీయ విద్రోహ కాండ. అప్రతిహత క్రూరకృత్యాల పురాణం అదంతా. నిజాం ఫ్యూడల్ బలగాలను నిగ్గించి నిలబడగలిగిన ప్రజా శక్తులు జాతీయ బూర్జువా నాయకత్వపు నైతిక, సైనిక శక్తుల ముందు పరాజయం స్వీకరించక తప్పలేదు.

తెలంగాణా ప్రజానీకం చేసిన అపారత్యాగాలూ, అపూర్వ ధైర్య సాహసాల గాథ అది. అలాంటి ఘటనలతో ఒకదానికి కథారూపం ఈ గెరిల్లా. అతడు–ఆమె నవలతో తెలుగు సారస్వతంతో సుస్థిర స్థానం సంపాదించిన శ్రీ ఉప్పల లక్ష్మణరావు గారు తమ కథకు వస్తువును శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారి "తెలంగాణా ప్రజల పోరాటం" నుంచి తీసుకున్నారు.

భుజానికి దెబ్బ తగిలింది. పోరాటానికి పనికిరాని పార్వతిని సంగం నాయకత్వం ప్రచార రంగంలో పెట్టింది. అక్కడ ఆమె నారయ్యా అనే సహచరుణ్ణి పెళ్ళాడుతుంది.

ఆ ఘట్టంలో నిజాముపై పోలీసు చర్యకు కేంద్ర ప్రభుత్వం సైన్య దళాలను పంపింది. కాని నిజానికి వారి వుద్దేశం ప్రజా వుద్యమం మీద "మిలిటరీ చర్య" నడపడం. ఇది తెలంగాణా ప్రజా వుద్యమంలో ఒక గొప్ప మలుపునే తెచ్చింది

తదనంతర ఘట్టంలో ఉద్యమ నాయకత్వం కంటి ఎదుట కనిపిస్తున్న బాహ్యపరిస్థితులను అర్థం చేసుకోక, కేవలం ఆత్మ ప్రత్యాయ ధోరణి లోనే వ్యవహరించడాన్ని ఒక పేరాలో వర్ణిస్తారు రచయిత.

"....రైతు వుద్యమంలో జీవం సన్నగిల్లుతూంది. భారత మిలటరీకి వ్యతిరేకంగా దళాలు విపరీతంగా నష్టపోతున్నాయి. పాతవాళ్ళు నేలకొరిగి పోతుండగా కొత్తవాళ్ళు చేరడం లేదు సరికదా, వున్నవాళ్ళలో కొందరు దళాలు వొదిలిపోతున్నారు సాయుధ పోరాటం నిలిపేస్తే తెలంగాణా రైతాంగానికి ద్రోహమే. రైతు వుద్యమానికి వెన్నుపోటే.'' "అనుకుంటుంది పార్వతి. శిబిరాలన్నింటినీ మూసేసీ, అందర్నీ సాయుధ దళాల్లో చేర్చి, అడవుల్లోకి పంపించి, మిలిటరీకి వ్యతిరేకంగా నిర్విరామ పోరాటం సాగించాలని పార్టీ కఠోర నిర్ణయం తీసుకుంది" (పుట 33-34)

పర్యవసానం, తెలంగాణా సాయుధ రైతు పోరాటం అంతం అయింది.

పార్వతి పోరాటాలతో మొదటి భర్తను పోగొట్టుకుంది. పోరాటాలలో పాల్గొంటూ పెంచే మార్గం లేక ఇద్దరు పిల్లల్ని ముక్కు మొగం ఎరగని ఎవరి చేతుల్లోనో పెట్టేసింది చివర "నాకు మిగిలిందేమిటి ?" నా ప్రాణమూ, నా పార్టీ .... అనుకుంటుంది పార్వతి.

తరవాత పార్వతీ, నారయ్యా పట్నం చేరతారు ఆమె ఒక ఆస్పత్రిలో నర్సుగా చేరుతుంది. నారయ్య కార్మికుల యూనియన్ కార్యకర్తగా పనిచేస్తున్నారు. "బతుకు సాఫీగానే సాగిపోతూంది" అంటుంది మూడో గెరిల్లా పార్వతి.

30-35 ఏళ్ళ క్రితం జరిగిన ప్రజావిముక్తి పోరాట గాధలను ఈ రూపంలో మరల స్మృతి పథంలోకి తెచ్చిన శ్రీ లక్ష్మణరావు గారు